



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 42 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 5 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# ఏఐ టెక్నాలజీదే భవిష్యత్తు



- ముందుచూపు ఉంటేనే ఏ రంగంలోనైనా పురోగతి
- రేపటి తరం భవిష్యత్ కోసం సరైన వేదికలను సిద్ధం చేయాలి
- ఆ బాధ్యత పాలకులు, పారిశ్రామికవేత్తలదే
- ప్రభుత్వాలు, ప్రైవేటు కలిసి పనిచేయాలి
- ఏడాదిలో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సదస్సులో చంద్రబాబు కీలకోపన్యాసం
- ప్రపంచ మార్పులకు అనుగుణంగా మనమూ మారుతూ ఉండాలి. ప్రస్తుతం కేవలం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సరిపోదు..

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ముందుచూపు ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యమని, రేపటి తరం భవిష్యత్ కోసం సరైన వేదికలను సిద్ధం చేయాల్సిన బాధ్యత పాలకులు, నేటి తరం పారిశ్రామిక వేత్తలపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లండన్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ ఆయన సతీమణి భువనేశ్వరికి మంగళవారం రెండు అవార్డులు అందించింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు కీలక ప్రసంగం చేశారు. ఐవోడీ సంస్థ కార్పొరేట్ ప్రపంచానికి 35 ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రపంచంలో రకరకాల మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా ప్రభుత్వాలు

- మిగతా2లో



## రికార్డు స్థాయి విజయం తథ్యం

- బిహార్‌లో జంగిల్‌రాజ్ నేతలకు ఘోర పరాభవం తప్పదు
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- బీజేపీ మహిళా కార్యకర్తలతో సంభాషణ
- గత 20 ఏళ్లలో ఏన్నడూ లేనట్టి అద్భుతమైన విజయం ఈ ఎన్నికల్లో సాధించబోతున్నాం జంగిల్‌రాజ్ మనుషులకు ఘోరమైన పరాభవం తప్పదు
- ఇద్దరు యువరాజులు రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల మద్దతు పొందడానికి తంటాలు పడుతున్నారు పార్టీ విజయం కోసం మహిళా కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నారు.

6

# సరైన ప్రమాణాలతో పనులు చేపట్టాలి

**రూ.2 వేల కోట్ల సాస్కీ నిధులతో రోడ్ల నిర్మాణం**

**అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు**

**ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గ్రామాల్లో కొత్త రహదారుల నిర్మాణం కోసం సాస్కీ (రాష్ట్ర మూలధన పెట్టుబడులపై ప్రత్యేక సహాయం) పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.2 వేల కోట్లు సమకూర్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో పటిష్ఠంగా రహదారులు నిర్మించాలని పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. సాస్కీ నిధుల వినియోగంపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో తీసుకొచ్చిన

- మిగతా2లో



## ప్రధానిది నకిలీ డిగ్రీ

- అందుకే విద్యారంగాన్ని పట్టించుకోరు
- రీల్స్‌లో యువత తలమునకలై ఉండాలనేదే ఆయన యోచన
- బిహార్ సభల్లో రాహుల్ ఆరోపణలు

6

# ప్రతి అడుగులోనూ రైతన్నకు నష్టమే

- ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే ధాన్యం కొనుగోలు చేయం అని బ్లాక్ మెయిల్ చేస్తారా?
- రైతుల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా, నిర్దయగా వ్యవహరిస్తోందో చెప్పడానికి శతకోటి ఉదాహరణలు
- మోంథా తుపాను ప్రభావిత ప్రాంత పర్యటనలో నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందో లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తుపాను దెబ్బకు పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు దృష్టిలో వ్యవసాయం అనేదే దండగ.. రైతు అనే వాడు వేస్ట్.. అందుకే ఆయన హయాంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం, రైతుల విషయంలో చంద్రబాబు మైండ్‌సెట్ మార్చుకోవాలి.. రైతులు రాష్ట్రానికి వెన్నెముక అని గుర్తించాలి. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వ తీరు మారకపోతే బాధితుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది' అని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్

- మిగతా2లో

# గ్రీవెన్స్‌ను గాలికొదిలేశారు!

- పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలే
- మీరు సరిగా నిర్వహిస్తే ఈ ఒక్కరోజే 5 వేల మంది వస్తారా?
- పార్టీ నేతలపై లోకేశ్ ఆగ్రహం
- సొంత ఇమేజ్‌తో గెలిచామనుకునే వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవచ్చు
- పార్టీ పరిణామాలపై లోకేశ్ సుదీర్ఘ చర్చ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ గ్రీవెన్స్ నిర్వహించాలని చెప్పాం. దాన్ని ఎవ్వరూ సక్రమంగా పాటించడం లేదు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజులన్నీ ఒక మంత్రి పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్న ఆదేశాన్ని కూ డా పట్టించుకోవడంలేదు. నియోజక వర్గాల్లో వారం లో ఏదో ఒక రోజు ప్రజాదర్బార్ నిర్వహించాలని చెప్పాం.. దాన్ని కూడా పాటించడం లేదు. ఇలా అయితే

- మిగతా2లో



## తూటాకు తూటాతోనే జవాబు

- భారత్‌పై దుస్సాహసం చేస్తే దీటుగా బదులిస్తాం
- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు అమిత్‌షా స్పష్టీకరణ

6

# భారతీయులే టార్గెట్

- తాత్కాలిక వీసాల తిరస్కరణకు కెనడా చట్టసవరణ?
- ఇమిగ్రేషన్ విభాగానికి మూకుమ్మడి తిరస్కరణ అధికారాలు
- ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం భారత విద్యార్థి వీసాల తిరస్కరణ
- కొన్నేళ్లుగా భారత్ నుంచి కెనడాల్లో ఆశ్రయం కోసం దరఖాస్తులు
- 2024లో అంతర్జాతీయ విద్యార్థుల నుంచి కెనడాకు 20,245 దరఖాస్తులు
- కెనడా నిర్ణయంపై వలసల హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన
- కెనడా ప్రభుత్వం తన ప్రయత్నాలను మానుకోవాలని దాదాపు 300 సంఘాలు విజ్ఞప్తి

6



# ఏఐ టెక్నాలజీదే భవిష్యత్తు

-మొదటిపేజీ తరువాయి
గానీ, సంస్థలు గానీ తమ ప్రణాళికల్లో మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు టెక్నాలజీ విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు దూరదృష్టి, పక్కా ప్లానింగ్ ఉండాలని సూచించారు. '1990ల్లో ఐటీ రంగ భవిష్యత్‌పై సందేహాలున్నా.. ఉమ్మడి ఏపీ సీఎంగా బిల్‌గేట్స్‌ను ఆహ్వానించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్టను స్థాపించేందుకు చొరవ తీసుకున్నాను. ఇప్పుడు భారతీయులు ప్రత్యేకించి తెలుగువారు గ్లోబల్ ఐటీ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) చాలా వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్ మొత్తం దాని చుట్టూనే తిరగనుంది. దీనికి అనుగుణంగా ఏపీలో విధానాలను, ప్రణాళికలను రూపొందించుకుంటున్నాం. గూగుల్ తన అతిపెద్ద ఏఐ కేంద్రాన్ని అమెరికా వెలుపల విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తోంది. ఇది రాష్ట్రంలో ఇన్నోవేషన్స్, రీసెర్చ్, స్కిల్ డెవల్‌పమెంట్ వంటి అంశాల అభివృద్ధికి దోహదపడుతుంది' అని సీఎం చెప్పారు. ఇంకా ఏం చెప్పారంటే..

**టెక్నాలజీతో మెరుగైన సేవలు**

టెక్నాలజీ అనేది ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి ఉపయోగపడేలా ఉండాలి. సాంకేతికతతో మెరుగైన సేవలు అందించేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి, మేం ఆ దిశగానే ప్రయాణిస్తున్నాం. ఇటీవల ఏపీని తాకిన మొంథా తుఫాన్ సమయంలో డేటా డ్రివెన్ రియల్ టైం గవర్నెన్స్ సిస్టమ్ వల్ల కచ్చితమైన అంచనాలు రూపొందించాం. ప్రిడిక్టివ్ అనలిటిక్స్ ద్వారా ప్రాణ, ఆస్తినష్టాన్ని తగ్గించాం. పాలనను ప్రజలకు మరింత దగ్గర చేసేలా 700కుపైగా పౌరసేవలను నేరుగా వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చాం. ఏపీ ప్రభుత్వం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించింది. కేవలం ఒక్క సంవత్సరంలోనే 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా దేశ లక్ష్యాలను కూడా ఏపీ పంచుకుంటోంది. కొత్త రాజధాని అమరావతిని బ్లూ, గ్రీన్ సిటీ నమూనాగా రూపొందించాం. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులు దేశాలను, పౌరులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నా యి. దీనిని దీర్ఘకాలంలో పరిష్కరించుకునే సమయం మనకు లేదు. ప్రతికూల వాతావరణాలతో పెనుము ప్పు ఎదుర్కోకముందే మనం మేలుకోవాలి. వసుధైక కుటుంబం అనే భారతీయ భావనతో దేశాలన్నీ కలిసి పనిచేయాలి. దేశాలు, భాషలు, సంప్రదాయాలు వేరై నా అంతా కలిసి భూమిపైనే నివసిస్తున్నాం. భావి త రాలకు మెరుగైన పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. దీనికి ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం కలిసి పనిచేయాలి. అప్పుడే భావితరం సురక్షితంగా ఉంటుంది. భారత్, యూకే నడుమ సుదీర్ఘమైన చారిత్రక బంధం ఉంది. దీనిని ఎప్పటికప్పుడు బలోపేతం చేసుకుంటూ వస్తున్నాయి. ఈ ఏడాది జూలైలో ఇరుదేశాల మధ్య కుదిరిన ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాల్లో మైలురాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు వంటి వాటిలో సహకారానికి ఈ ఒప్పందం బలమైన పునాది వేసింది. భారత్ తన 100వ స్వాతంత్ర్యదినోత్సవం నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తోంది.. ఆ దిశగా అడుగులు వేస్తోంది.

**భువనేశ్వరికి అభినందనలు**

ప్రతిష్ఠాత్మక సంస్థగా ఐవోడీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. ఇలాంటి సంస్థ భువనేశ్వరి సేవలను గుర్తించడం చాలా సంతోషాన్నిస్తోంది. ఈ అవార్డులు దక్కించుకున్నందుకు ఆమెకు అభినందనలు.

యూకే వర్సిటీలతో ఏపీ భాగస్వామ్యం!

లండన్‌లోని భారత్ హైకమిషనర్‌తో సీఎం చర్చ

లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామితో సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అ య్యారు. మంగళవారం జరిగిన ఈ భేటీలో యూకేలోని వివిధ విశ్వవిద్యాలయాలతో రాష్ట్రప్రభుత్వం నాలుగు అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునే అంశంపై చర్చ జరిగింది. ఏపీలో ఆయా వర్సిటీల కేంద్రాలను ప్రారంభించడంపైన, కేంద్రం స హకారంతో జాయింట్ వెంచర్ ఏర్పాటుపైనా చ ర్చించారు. లండన్ వర్సిటీలు ఏపీ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలించాలని, అలాగే విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ అంశంపై దృష్టి సారించాలని సీఎం కోరారు. లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, మెటల్స్ అంశాల్లో ఏపీ, యూకే వర్సిటీల మధ్య భాగస్వామ్యాల గురించి.. ఏఐ, సెమీకండక్టర్, మెరైన్ ఇండస్ట్రీ 4.0లో సహకారంపైనా దొరస్వామితో ఆయన చర్చించారు.

## సరైన ప్రమాణాలతో పనులు చేపట్టాలి

-మొదటిపేజీ తరువాయి
నిధులివి. వీటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంపై ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ రోడ్లు మెరుగుపడేలా నిధులు సమకూరుస్తున్నాం. నాణ్యతపై రాజీ పడొద్దు. రహదారుల నిర్మాణంలో ప్రమాణాలు పాటిస్తున్నారో, లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. నిర్మాణం మొదలయ్యాక పలు దశల్లో నాణ్యత పరిశీలించాలి. నేను, నిపుణులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేస్తాం. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేయకపోతే అధికారులు, ఇంజినీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు. ప్రతి గ్రామానికీ రహదారులు ఉండాలి. మౌలిక సదుపాయాల కల్పనలో రహదారులు ఎంతో కీలకం. ప్రత్యేకమైన ప్రాంతాల్లో, సందర్భాల్లో సాస్కి నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

**పుట్టపర్తిలో మౌలిక వసతులకు రూ.35 కోట్లు**

'సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పంచాయతీరాజ్ రోడ్లు పటిష్ఠపరచాలి. ఇందుకోసం సాస్కి పథకం నుంచి రూ.35 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరించింది. కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నా విస్మరించింది. కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నిధులు పొందడంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సీఎం చంద్రబాబు తగిన సూచనలు అందిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలన్న కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు.

## గ్రీవెన్స్‌ను గాలికొదిలేశారు!



-మొదటిపేజీ తరువాయి
ఎలా పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే వారి ని ఏమనాలి? ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాల్సిందే' అని టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన పార్టీ కార్యకలాపాలపై నేతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ నిర్వహణను గాలికొదిలేశారంటూ లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు గ్రీవెన్స్ నిర్వహణ సరిగా చేస్తే నేను వచ్చిన రోజు 5,000 మంది వచ్చే అవకాశం ఉండేది కాదు. ఇకపై గ్రీవెన్స్ విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తాం. ఎవరైనా నిర్ల క్ష్యం చూపితే సీరియస్ చర్యలు ఉంటాయి. ఇప్పటి వరకు నియోజకవర్గాల్లో ఎంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు గ్రీవెన్స్ నిర్వహించారో నాకు నివేదిక ఇవ్వండి' అని లోకేశ్ ఆదేశించారు.

**ఎంతటివారికైనా పార్టీనే సుప్రీం**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చిన్ని వివాదంపై లోకేశ్ స్పందిస్తూ... 'క్రమశిక్షణ విషయంలో టీడీపీ పెట్టింది పేరు. దాన్ని చెడగొట్టేలా ఏ స్థాయి నాయకుడు ప్రవర్తించినా చర్యలకు ఉపేక్షించేది లేదు. ఎవరికైనా పార్టీనే సుప్రీం. పార్టీ లేకుంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు లేరు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటేనే మంత్రి పదవులైనా, కార్పొరేషన్ పదవులైనా. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని నడుచుకోవాలి. పార్టీ లైన్ దాటి విమర్శలు, ఆరోపణ లు చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. పార్టీని బేఖాతరు చేసే వారు, తమ సొంత ఇమేజ్ తో గెలిచామనుకునే వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవచ్చు. తిరువూరు వివాదంపై నివేదికను బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు నా కూ ఇవ్వండి. చంద్రబాబు లండన్ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత మాట్లాడి ఓ నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు.

**సీనియర్ చనిపోతే ఇంటికి కూడా వెళ్లరా..!**

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఉదంతంపైనా లోకేశ్ సీరియస్ అయ్యారు. కావలిలో సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించిన సుబ్బానాయుడు విషయంలో ఎమ్మెల్యే తీరు సరిగా లేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి ఫరూక్‌ని కార్లో కూర్చోబెట్టుకుని కృష్ణా రెడ్డి వారిని కూడా తప్పుగా ప్రొజెక్ట్ చేశారని ఆరోపించారు. కావలిలో జరిగే సుబ్బానాయుడు కార్యక్రమానికి తానుకూడా వస్తున్నట్లు స్ప ష్టం చేశారు. 'పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో ఓ కంట కనిపెట్టి ఉండాల్సిన బాధ్యత మీపై ఉంది' అని పల్లాకు లోకేశ్ తేల్చి చెప్పారు. ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఉద్దేశించి మాట్లాడుతూ.. 'జోగి రమేశ్ బీసీ కార్డు వాడి టీడీపీపైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేస్తూ రెచ్చిపోతుంటే మీరంతా ఏం చేస్తున్నా రు? కులం కార్డు తీసిన వెంటనే మీరు స్పందించాల్సిన పని లేదా? సీనియర్లు ఎవరికి వారు స్వతహాగా నిర్ణయాలు తీసుకుని స్పందించాలి. పార్టీ స్ట్రాటజీ కమిటీ కూడా ఎప్పటికప్పుడు ప్రత్యర్థుల విమర్శలను గమనిస్తూ కౌంటర్‌లు సిద్ధం చేయాలి' అని లోకేశ్ ఆదేశించారు.

# ప్రతి అడుగులోనూ రైతన్నకు నష్టమే

-మొదటిపేజీ తరువాయి
జగన్‌మోహన్‌రెడ్డి గట్టిగా హెచ్చరించారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. మంగళవారం ఆయన కృష్ణా జిల్లాలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. పంట పొలాల్లో దిగి.. బాధిత రైతులతో మమేమకవుతూ జరిగిన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన తానున్నానంటూ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గూడూరు మండలం ఆకుమర్రు లాకు వద్ద బాధిత రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతు కన్నీరు పెడితే ఏ ప్రభుత్వానికైనా అరిష్టం అని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. 'మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లండన్ పోతాడు.. ఆయన కొడుకు ఆస్ట్రేలియా నుంచి వచ్చి క్రికెట్ మ్యాచ్ చూడుటానికి ముంబై పోతాడు.. రైతుల విషయంలో ఈ ప్రభుత్వానికి ఏపాటి చిత్తశు ద్ధి ఉందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదు' అని ఎత్తిచూపారు. పంటలు దెబ్బ తిన్న ప్రతీ రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పంటల బీమా పరిహారం కూడా ఇవ్వాలని, ప్రస్తుత రబీ సీజన్ నుంచైనా ఉచిత పంటల బీమాను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గత 18 నెలల్లో సంభవించిన విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ.600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**18 నెలల్లో ఒక్క రైతుకైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా?**

రైతు పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఒకసారి మారుమూల ప్రాంతాలకు వెళ్లాలి. క్షేత్ర స్థాయిలో తిరిగితేనే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. ఈ ప్రభుత్వం రైతుల విషయంలో ఎంత నిర్దాక్షిణ్యంగా, ఎంత నిర్దయగా వ్యవహరిస్తుందో చెప్పడానికి శతకోటి ఉదాహరణలు ఉన్నాయి. మొంథా తుపాను దాదాపు 25 జిల్లాలపై ప్రభావం చూపింది. అటు గోదావరి జిల్లాల నుంచి శ్రీకాకుళం వరకు, ఇటు కృష్ణా నుంచి కర్నూలు వరకు దాని ప్రభావం కన్పించింది. దాదాపుగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నిజంగా ఎప్పుడూ ఊహించని విధంగా పంటలు నష్టపోయిన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వరి పంటకే ఎక్కువగా 11 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పత్తి, మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంటలు మరో నాలుగు లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నాయి. వరి పంట గింజలు పాలు పోసుకున్న దశలో తుపాను విరుచుకుపడింది. తీవ్రమైన గాలులు, వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతింది. చంద్రబాబు 18 నెలల పాలనలో దాదాపు 16 సార్లు తుపానులు, వరదలు, అకాల వర్షాలు, కరువు వంటి వైపరీత్యాల వల్ల రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ 18 నెలల్లో ఏ రైతుకైనా ఒక్క సారైనా ఒక్క రూపాయి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా? ఏ రైతుకైనా ఒక్కసారైనా పంటల బీమా పరిహారం (ఇన్స్యూరెన్స్) ఇచ్చారా? అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తా అని హామీ ఇచ్చి.. రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.ఐదు వేలతో సరిపెట్టారు.

ఇన్‌పుట్ సబ్సిడీ రూపాయి రాలేదు. ఇన్సూరెన్స్ రాలేదు. చివరికి ఎరువులు బ్లాకులో కొనుక్కోవాల్సిన పరిస్థితుల్లోకి రైతులు వెళ్లిపోయారు. రూ.266కు దొరకాల్సిన యూరియా కట్టను ఏకంగా రూ.500, రూ.600 చొప్పున బ్లాకులో కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అవసరాన్ని బట్టి బ్లాకులో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఇలా కష్టాల సాగు చేసిన రైతులు తాము పండించిన పంటను అమ్ముదామంటే ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర రాని పరిస్థితి. కనీసం మద్దతు ధరకు కూడా కొనే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది ధాన్యం 75 కేజీల బస్తాకు మద్దతు ధర ప్రకారం రూ.1,750 రావాల్సి ఉండగా, రైతుల చేతికొచ్చింది మాత్రం కేవలం రూ.1,350 మాత్రమే. చంద్రబాబు హయాంలో ప్రతి అడుగులోనూ రైతు నష్టపోతూనే ఉన్నాడు.

**నాడు ప్రతి రైతుకు భరోసా**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో వారిపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని ఐదేళ్ల పాటు అమలు చేసి అండగా నిలిచింది. మూడున్నర ఎకరాలున్న రైతులు సైతం దాదాపు రూ.70 వేలు, రూ.66 వేలు చొప్పున గతంలో బీమా పరిహారం డబ్బులు అందుకున్న పరిస్థితులను ఇక్కడి రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజు ఏ రైతు ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. విపత్తుల వేళ పంట నష్టం జరిగితే ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని ఏ రోజు ఏ రైతు ఆ ఐదేళ్లలో అధైర్య పడలేదు. కారణం.. పంట నష్టం జరిగితే జగనన్న ఉన్నాడు.. పైసా భారం పడకుండా తమ పంటకు బీమా చేయించాడని, తమకు డబ్బులొస్తాయని ధైర్యంగా ఉండేవారు. ప్రతి రైతుకు భరోసా ఉండేది.

ఏదైనా విపత్తు వేళ పంటలకు నష్టం వాటిల్లితే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు ఇస్తాడనే ధైర్యం ఉండేది. ఆ డబ్బులతో మరుసటి సీజన్‌లో పెట్టుబడి పెట్టుకోవచ్చనే ధైర్యం ఉండేది. సీజన్ మొదలయ్యే సరికే ప్రతి రైతుకు ఓ భరోసా ఉండేది. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున ఇస్తారన్న నమ్మకం ఉండేది. ఆర్బీకే వ్యవస్థ అనేది రైతులను చేయి పట్టి నడిపించే వ్యవస్థగా ఉండేది. ప్రతి రైతు వేసిన పంటకు ఈ%–%క్రాప్ జరిగేది. ఆర్బీకే పరిధిలోనే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్.. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులకు అందుబాటులో ఉండే వారు. సచివాలయాలతో అనుసంధానం చేసి వలంటీర్లతో కలిసి రైతులను చేయిపట్టి నడిపించేవారు. ప్రతి రైతును.. అతను సాగు చేసిన పొలంలో నిలబెట్టి జియో ట్యాగ్ చేసి ఈ%–%క్రాప్ బుకింగ్ చేసే వారు. తద్వారా పంటకు ఎప్పుడు, ఏ ఇబ్బంది వచ్చినా రైతుకు ప్రభుత్వం తోడుగా నిలబడేది.

**ధరలు పతనమైన ప్రతిసారి ప్రభుత్వ జోక్యం**

ఆర్బీకే పరిధిలో ఏ రైతుకైనా గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉండేది కాదు. ఆర్బీకే పరిధిలో ఏ పంటను ఏ రేటుకు కొనుగోలు చేసేది రైతులకు తెలియజేసేవాళ్లం. ఆ రేట్ల కంటే తక్కువగా పడిపోతే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. మద్దతు ధరల వివరాలు ఆర్బీకేలో ప్రదర్శించేవాళ్లం. ఎక్కడ ఏ పంట రేటు తగ్గినా వెంటనే ఆర్బీకే అసిస్టెంట్ నుంచి ఎలెర్ట్ వచ్చేది. మార్క్‌ఫెడ్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఉన్న జేసీలు వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకునే వారు. ధరలు పడిపోయిన పంటలను కొనుగోలు చేసి, మార్కెట్‌లో పోటీని తీసుకొచ్చి ర్రైతుకు తోడుగా నిలబడేవారు. ఇందుకోసం కంటిన్యూస్ మానిటరింగ్ అండ్ అగ్రికల్చర్ ప్రైస్ అండ్ ప్రొడ్యూస్ (సీఎం యాప్) అనే యాప్ ఆర్బీకే అసిస్టెంట్ చేతిలో ఉండేది. ఈ యాప్ ద్వారా గ్రామ స్థాయిలో ధరలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ప్రతి రైతుకు బాసటగా నిలిచే వారు. ఇలా ఐదేళ్లలో ధర లేని సమయంలో రూ.7,800 కోట్లు ఖర్చు చేసి కనీస మద్దతు ధరలకు ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. ఇందుకోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశాం. అప్పట్లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ%–%క్రాప్‌లో నమోదు చేసేవాళ్లం. తద్వారా రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేశాం. దాదాపు 85 లక్షల మంది రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఉచితంగా పంటల బీమా అమలు చేశాం. 54.55 లక్షల మంది రైతులకు ఇన్సూరెన్స్ కింద రూ.7,800 కోట్లు జమ చేశాం. ప్రస్తుతం చంద్రబాబు హయాంలో కేవలం 19 లక్షల మంది మాత్రమే ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. అది కూడా బ్యాంక్ రుణాలు తీసుకున్న వారు. మరి ప్రీమియం చెల్లించని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటి? ఈ విపత్కర పరిస్థితుల్లో వారికి పంటల బీమా పరిహారం అందకుండా చేయడం దుర్మార్గం కాదా?

**ఇదేం విడ్డూరం.. ఒక్క రోజు ముందు ప్రొసీడింగ్సా!?**

? తుపాన్‌తో నష్టపోయిన రైతులు ఆశ్చర్యం కలిగించే విషయాలు చెబుతున్నారు. మీ పొలంలో ఎన్యుమరేషన్ చేయడానికి ఎవరైనా వచ్చారా? అని అడిగితే.. ఈ పొలంలోకే కాదు రాష్ట్రంలో దెబ్బతిన్న ఏ పొలంలోకి, ఏ రైతు దగ్గరకు ఎన్యుమరేషన్ చేసేందుకు ఎవరూ రాలేదన్న మాట విన్పిస్తోంది. కృష్ణా జిల్లా కలెక్టర్ అక్టోబర్ 30వ తేదీన ప్రొసీడింగ్స్ (ఉత్తర్వులు చూపిస్తూ) ఇచ్చారు.

ఎన్యుమరేషన్ ఆఫ్ క్రాప్ డామేజ్, సోషల్ ఆడిట్ 31వ తేదీ కల్లా పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఒక్క రోజులో ఎన్యుమరేషన్ (పంట నష్టం మదింపు), సోషల్ ఆడిట్ అయిపోవాలట! ఎలా సాధ్యమో మీరే చెప్పండి. పైగా ఈ గడువులోగా చేయకపోతే యాక్షన్ తీసుకుంటామని ఇదే ప్రొసీడింగ్స్‌లో స్పష్టం చేశారు. క్రాప్ డామేజ్, ఎన్యుమరేషన్, సోషల్ ఆడిట్, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అంతా పూర్తి చేసి తుది జాబితాలను 1వ తేదీకల్లా వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌కు పంపాలని పేర్కొన్నారు. ఈ ఆదేశాలు చూస్తుంటే ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారో తెలుస్తోంది.

ఎన్యుమరేషన్ అనేది ఎవరూ పంట పొలాల వద్దకు వచ్చి చేసే పరిస్థితి లేదు. గాలులు, తుపాను వల్ల ధాన్యం సుంకు విరిగిపోయింది. ఎన్యుమరేషన్ చేసేటప్పుడు ఏ అధికారి అయినా సరే పొలంలో అడుగుపెట్టాలి. వరి కంకులను చూడాలి. సుంకు (పుప్పొడి) రాలిపోయిందా? లేదా? అన్నది పరిశీలించాలి. ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఈ విషయాన్ని స్పష్టంగా రాయాలి. సుంకు రాలిపోతే పాలు పోసుకునే పరిస్థితి ఉండదు. జర్మినేషన్ ప్రాసెస్ ఆగిపోతుంది. తద్వారా తాలు గింజలు ఏర్పడతాయి. ఈ వాస్తవాలు పరిశీలించేందుకు పొలాల వద్దకు వెళ్లకుండానే ఎన్యుమరేషన్ అయిపోయిందంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? ఇదేనా రైతులకు మేలు చేసే విధానం?

**ధాన్యం కొనబోమని బ్లాక్ మెయిల్ చేస్తారా?**

ఎన్యుమరేషన్ కోసం ఎందుకు పొలం వద్దకు రాలేదని ఏ రైతు అయినా అడిగితే వారిని వెటకారం చేసి మాట్లాడుతున్నారు. పైగా ప్రతి రైతుకు వ్యవసాయ శాఖాధికారి నుంచి తాము చెప్పిన పత్రాలు (ఆధార్, 1బి జిరాక్స్, కౌలు గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం) సమర్పించిన వారి పొలాల్లో మాత్రమే పంట నష్టం పరిశీలించి జాబితాలో పెడతామని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా కూడా చెప్పిస్తున్నారు. అదీ అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా తీసుకొస్తేనే స్వీకరిస్తామని, లేదంటే ఆ పత్రాలు స్వీకరించం అని తెగేసి చెబుతున్నారు.


మరొక వైపు 'దయచేసి రైతులు గమనించగలరు. ఇప్పుడు పంట నష్టం చేయించుకున్న రైతుల నుంచి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయబడదు' అని నిర్దయగా మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎవరైనా అడిగితే వాళ్ల ధాన్యం కొనుగోలు చేయరట! అంటే బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? ఎక్కడైనా తుపాను వచ్చినపుడు ప్రభుత్వం మానవత్వం ప్రదర్శించాలి. నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకునేందుకు ముందుకు రావాలి. పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ), పంటల బీమా పరిహారం (ఇన్స్యూరెన్స్) వచ్చేలా చేయాలి. అంతే కాకుండా వారి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టాలి. అది ఇస్తే ఇది ఇవ్వం.. ఇది ఇస్తే అది ఇవ్వం.. అని చెబుతూ రైతులను బెదిరించడం దారుణం. దీన్నిబట్టి ఈ ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతోంది.

**మా హయాంలో కచ్చితమైన చర్యలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి తుపానులు వచ్చే ముందు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించే వాళ్లం. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జిల్లా యంత్రాంగం కలిసి పనిచేసేది. కొత్త జిల్లాల ఏర్పాటుతో కలెక్టర్ల పరిధి తగ్గించాం. తక్కువ నియోజకవర్గాలకు ఎక్కువ మంది కలెక్టర్లు, జేసీలు వచ్చారు. ఇలాంటి విపత్తుల వేళ ప్రాణ నష్టం జరగకుండా కచ్చితమైన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే వాళ్లం.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 05 నవంబర్ 2025

www.viswamvoice.com




# నేడే సత్యదేవుని గిరిప్రదక్షిణం

## 9.2 కిలో మీటర్ల దూరం పొడవునా పూర్తైన ఏర్పాట్లు - భక్తులకు ఆధ్యాత్మిక కనువిందు కానున్న గిరిప్రదక్షిణ





అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, రమాదేవి గిరిప్రదక్షిణ కార్యక్రమం బుధవారం కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున అత్యంత వైభవంగా జరుగనుంది. అన్నవరం సత్యదేవుని గిరిప్రదక్షిణ కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా జరిగే ఒక వార్షిక కార్యక్రమం. ఈ ప్రదక్షిణలో స్వామి, అమ్మ వార్ల సత్యరథం ముందు వెళుతుండగా వెనుక భక్తులు అనుసరిస్తూ కొండ చుట్టూ నడుస్తారు. సుమారు 9.2 కిలో మీటర్ల దూరం పొడవునా సత్యదేవుడు తన రత్నగిరి, సత్యగిరులకు సతీ,సమేతంగా స్వీయ ప్రదక్షిణం చేసుకుంటూ పయనిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారు. తొలుత దేవస్థానంలో శ్రీస్వామి, అమ్మవార్లను పల్లకీలో సుఖాసీనులను చేసి దేవస్థానంపై ఊరేగిస్తారు. అలా ఊరేగిస్తూ ఉదయం ఉదయం 8.30 గంటల శుభముహూర్తపు ఘడియలకు దేవాలయం కొండ దిగువన ఉన్న తొలి పావంచాల వద్దకు పల్లకీలో తీసుకుని వస్తారు. వేలాది సుగంధ, పరిమళ పుష్పాలతో సద్బ్రాహ్మణులు ప్రత్యేకంగా అలంకరించి తీర్చిదిద్దిన సత్యరథంలో శ్రీ స్వామిని, ఇష్ట సఖి ఆధ్యాది మహాలక్ష్మిని అత్యంత భక్తి శ్రద్ధలతో సుఖాసీనులు చేస్తారు. ఇక్కడ ప్రత్యక పూజలను నిర్వహిస్తారు. అనంతరం తొలి పావంచాల వద్ద నుంచే మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథం గిరిప్రదక్షిణ యాత్ర అధికారికంగా ప్రారంభం అవుతుంది. ఇక్కడ నుంచే సత్య రథం వెంట వేద పండితులు, పురోహితులు, ఆలయ సిబ్బంది, అశేష భక్త జన సంద్రం వెంట తరలి రాగా సకల శోభాయమానంగా మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, తప్పెట్లు, తాళాలు, డప్పులు, రుంజ వాయిద్యాల శబ్ద విన్యాసాల నడుమ, స్వామి నామ స్మరణతో అశేష జనవాహిని బెండపూడి వైపుగా స్వామివారి యాత్ర సాగుతుంది. బెండపూడి సమీపంలోని పోలవరం గట్టు మార్గం, సత్యగిరి మీదుగా అన్నవరం వైపు కొండల తట్టు ప్రాంతాల మీదుగా గిరిప్రదక్షిణ యాత్ర పయనిస్తుంది. భక్తి విజ్ఞాన, వినోద మనో రంజకంగా ఆసక్తికరంగా, నయన మనోహరంగా, వీనుల విందుగా వేద పండిత అగ్రేసరుల నియమాల అనుసారం గిరి ప్రదక్షిణ సజావుగా వేడుకగా కొనసాగుతుంది. చివరకు గిరి ప్రదక్షిణ రత్నగిరి స్వస్థానానికి చేరుకుంటుంది. అనంతరం దేవస్థానంపై స్వామి అమ్మ వార్లకు వేద పండితులు మంగళ హారతులు ఇస్తారు. తదుపరి స్వామి అమ్మ వార్లను యధావిధిగా గర్భగుడిలో ప్రవేశ పెట్టడంతో గిరి ప్రదక్షిణ యాత్రా దైవ కార్యం ఫలప్రదంగా పరిపూర్ణం అవుతుంది. లక్షలాది మంది భక్తులు హాజరు అవుతారన్న అంచనాతో దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మార్గం పొడవునా శ్రీ స్వామి, అమ్మ వార్ల వెంట పయనిస్తూ అలసి సొలసి, ఆకలి, దప్పికలకు గురయ్యిన భక్తులకు ఉపశమనం కోసం దాతల సహకారంతో గిరి ప్రదక్షిణ పొడవునా మార్గం మధ్యంలో అక్కడక్కడా చలువ పందిళ్ళ విడుదులను ఏర్పాటు చేసారు. పండ్లు, పాలు, తాగునీరు, మజ్జిగ, దద్దోజనం, పులిహోర, బిస్కత్తులు ఇతరత్రా సాత్విక శాకాహార పదార్థాలను దేవస్థానం సిబ్బంది సిద్ధం చేశారు. భక్తులు బడలికను తీర్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసారు. గిరి ప్రదక్షిణా శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, భక్తుల భద్రతకు పెద్ద సంఖ్యలో పోలీసులు విధులను నిర్వహిస్తారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, తొక్కిసలాట జరగకుండా ఉండేలా భద్రతా ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. అనేక జన్మల పాపాలను తొలగించి, స్వామివారి అనుగ్రహాన్ని పొందడం ఈ ప్రదక్షిణ వెనుక ఉన్న ఆధ్యాత్మిక ఉద్దేశ్యంగా ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు వెల్లడించారు.

# రేషన్ కోసం తప్పని పరేషాన్

## రేషన్ షాప్ ముందు భారీగా క్యూ లైన్లు - ఈకేవైసితో ప్రజలకు తప్పని ఇక్కట్లు



ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ : అల్లూరి సీతారామ రాజు జిల్లా మండల కేంద్రమైన ఎటపాక గ్రామంలో రేషన్ లబ్దిదారులు చౌక దుకాణాల వద్ద భారీ క్యూ లైన్లలో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. రేషన్ డీలర్లు ఎప్పుడు అందుబాటులో ఉంటారో, సమాచారం లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎండియూ ఆపరేటర్లు వాహనాల ద్వారా రేషన్ ను రేషన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే సరఫరా జరిగేదని, నేడు రేషన్ షాపులు ముందు గంటలు తరబడి లైన్ లో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివలన వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ కేవైసీ పేరుతో వృద్ధులు వేలిముద్రలు పడక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, రేషన్ షాప్ సుదూరంగా ఉండటం వల్ల కిలోమీటర్ల మేర నడిచి వచ్చి రేషన్ తీసుకోవాల్సి వస్తుందని మండలంలోని చింతలగూడెం గ్రామంలో షాపు నంబర్ 43 పరిధిలో ఉన్న రేషన్ కార్డుదారులు రేషన్ కార్డుదారులు వాపోయారు. కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయాలని అదేవిధంగా వృద్ధులకు ఈ- కెవైసి మినహాయింపు ఇచ్చి రేషన్ సరఫరా ఇంటి వద్దకే సరఫరా చేయాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టినప్పటికీ రేషన్ డీలర్లు వాటిని పట్టించుకోకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామ సభలో వంగలపూడి, సిగవరం గ్రామల

# ఉపాధి హామీ పనుల గుర్తింపు : ఏపిఓ బివి సత్యవతి




సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : సీతానగరం గ్రామపంచాయతీలో టెక్నికల్ అసిస్టెంట్ వీరబాబు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు మరియు గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో 15 పంట కాలవలు, చెరువులు 2, మట్టి రోడ్డు నిర్మాణం పనులు 2,కంపోస్ట్ పిట్లు 3, గోకులాలు 3, ట్రెంచ్ పనులు 5 గుర్తించడం జరిగిందని అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఈ కేవైసీ వెరిఫికేషన్ ఖచ్చితంగా చేయించుకోవాలని ఏపీఓ సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, సెక్రటరీ డి.వి.ఎన్ రత్నం, సొసైటీ చైర్ పర్సన్ మట్టా వెంకటేశ్వరరావు, మట్ట కాపు, తోలేటి బాబు, మట్ట నాగేశ్వరరావు, ముళ్ళ సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణవేణి, మేట్లు, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

# బాహుదేవ్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరణ

## అజ్జరపు రమేష్‌బాబు సమాజ సేవలకు ప్రముఖులు అభినందనలు

## పేదలకు బియ్యం, ట్రై సైకిల్, మందులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : టీడీపీ నాయకుడు అజ్జరపు రమేష్ బాబు తన తల్లితండ్రులు అజ్జరపు లక్ష్మీ సుందర్రావు దివ్య ఆశీస్సులతో స్థాపించిన బాహుదేవ్ ఫౌండేషన్‌ను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించి ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక 48వ డివిజన్ పనస చెట్టు సెంటర్‌లో జరిగిన ఆవిర్భావ సభలో 100 మంది పేదలకు 10 కేజీల చొప్పున బియ్యాన్ని, ఒక వికలాంగుడికి మూడు చక్రాల సైకిల్‌ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డితో పాటు జనసేన సిటీ ఇన్‌చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, సిటీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అజ్జరపు రమేష్ మాట్లాడుతూ తన డివిజన్‌లో ఎవరూ ఆకలితో ఉండకూడదనే సంకల్పంతో ప్రతీ నెలా 100 మంది పేదలను ఎంపిక చేసి బియ్యం పంపిణీ చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలబడటానికి బాహుదేవ్ ఫౌండేషన్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఫౌండేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా మదర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేసారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలకు మరింత మంచి సేవలు అందుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అజ్జరపు రమేష్‌బాబుని అభినందించారు.





# సైబర్ నేరాలపై అవగాహన..




ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ : ధవలేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులకు బ్యాంకు ఖాతా నుండి అధిక మొత్తంలో సైబర్ నేరగాళ్ల ద్వారా కోల్పోతున్న సొమ్ముపై అవగాహన కల్పించేందుకు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బి.అరుణ్ కుమార్ సౌజన్యంతో అసోసియేషన్ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ప్రతినిధులుగా విచ్చేసిన విభూతి బ్రదర్స్ సైబర్ నేరాలపై జరుగుతున్న దాడులను కూలంకషంగా బుర్రకథ రూపంలో హాస్యోక్తులతో వివరించారు. ఇటీవల అనేకమంది ఖాతాదారుల నుండి లక్షల రూపాయలు యదేశ్చగా దోపిడీ జరగడం ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియాలో చూస్తున్నామని తద్వారా జాగరూకతతో మెలగాలని తెలియపరిచారు, ధర్మరాజు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఏటీఎం కార్డు ఇవ్వడం గానీ, కార్డు కవర్లో పిన్ నెంబర్ రాయటం కానీ, పిల్లలకు ఫోన్లు ఇవ్వడం ద్వారా ఇటువంటి అరాచకాలు జరిగే ప్రమాదం ఉంది, మీ ఏటీఎం కార్డు పాన్ కార్డు ఆధార్ కార్డు వంటి వివరాలు ఎవరైనా అడిగినట్లయితే బ్యాంకు సిబ్బందికి తెలియపరచడం, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వర శర్మ, కోశాధికారి ఉర్రింకల సత్యనారాయణ, వెంపరాల వెంకటేశ్వర్లు, బండారు రవీంద్ర, శ్రీరాములు, బుగ్గ సుబ్రహ్మణ్యం, ఎడిజెబి ప్రసాదరావు, రంగారావు, కొండ సూర్యనారాయణ, సమర్తకుర్తి సుబ్బారావు, కొంజర్ల వెంకటరత్నం, శ్రీరంగం వెంకటేశ్వరరావు, అంజూరి సూర్యరావు తదితరులు పాల్గొన్నారు, ఇటీవల ఇరిగేషన్ ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గాఎన్నికైన తోరం కేశవరావుని దుసశ్శాలువా పూమాలలతో సత్కరించారు.

# చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను గుర్తించాలి

## నారాయణ ఒలింపియాడ్ విద్యాసంస్థల్లో ఎస్ఎల్‌సి కార్యక్రమం

## విద్యార్థుల ప్రతిభను జూమ్‌లో వీక్షించిన అధినేత నారాయణ, రమామేడం



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక వి.ఎల్ పురంలోని ఉన్న స్థానిక నారాయణ (ఒలింపియాడ్) విద్యాసంస్థలలో జరిగిన స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్.ఎల్.సి.) కార్యక్రమాన్ని క్లస్టర్ ప్రిన్సిపాల్ నీరజ ప్రారంభించారు. ముఖ్యఅతిధిగా ఆర్ అండ్ డి హెడ్ మోహిని, ఈ -చాంప్స్ కో-ఆర్డినేటర్ మాధురి పాల్గోన్నారు. ఈ కార్యక్రమాల వల్ల పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావచ్చని విద్యాసంస్థల అధినేత పొంగురు నారాయణ, రమా మేడమ్ తెలిపారు. పిల్లల్లో ప్రతిభను, వారు అభ్యాసించిన పాఠ్యంశాలను నేరుగా నారాయణ, రమా మేడమ్ జూమ్ లైవ్‌లో వీక్షించారు. దీని ద్వారా పిల్లల్లో బోధన ప్రాముఖ్యత, బోధన వివరణ పిల్లలకి స్థిరంగా నిలిచి ఉంటుందని రాజమండ్రి క్లస్టర్ ప్రిన్సిపాల్ నీరజ తెలిపారు. ఇందులో ఫస్ట్ అండ్ సెకండ్ క్లాసు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సహం పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నారాయణ స్కూల్ హెడ్, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది విజయవంతం చేసారు.

# జిల్లాస్థాయి పోటీలకు సరస్వతి విద్యార్థులు ఎంపిక : పెనకటి



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : జిల్లాస్థాయి క్రీడాపోటీలకు కోరుకొండ "సరస్వతీ విద్యా నికేతన్" విధ్యార్థులు ప్రతిభను కనబరిచి ఎంపికైనట్లు కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ అన్నారు. అనపర్తిలో నిర్వహించిన పోటిలలో సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని, పలు బహుమతులను కైవాసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అనపర్తి డివిజన్‌లో (ఎస్.జీ.ఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు (ఎస్‌జిఎఫ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ) పి సుధారాణి ఆద్వర్యంలో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కోకో క్రీడా విభాగంలో టి మోక్ష శ్రీ సాయి, చెస్ క్రీడా విభాగంలో ఓ స్వర్ణ అలేఖ్య జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు తెలిపారు. విజేతలను కరస్పాండెంట్ పెనకటి గంగాధర్, ఉపాధ్యాయులు వై.ప్రభావతి, ఉపప్రదానోపాధ్యాయులు హనుమ ఘనంగా అభినందించారు. అదేవిధంగా కోచ్ సాయికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యా నికేతన్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్స్ యూనియన్ ఆధ్వర్యంలో

# ఘనంగా మల్లేశ్వరరావు జన్మదిన వేడుకలు



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ దేవి వెంకట మణిసాయి మోటార్ మెకానికల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొల్లిపాటి ఉదయ్ మల్లేశ్వరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జంబుపట్నం మోటార్స్ యూనియన్ కార్యాలయంలో కోరుకొండ మండలం మోటార్ వర్కర్స్ ఆధ్వర్యంలో మల్లేశ్వరరావు జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శివ, సర్దార్,పచ్చారి వెంకటరమణ, కొచ్చర్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి

# ఆర్‌ఎస్ న్యూరో మల్టీస్పెషాల్టీ హాస్పటల్ సహాయం



కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ : దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలోని కందుకూరి రాఘవమ్మ పోలియో,భర్త పేరాల్సిస్ తో బాధపడుతున్నారు.వీరికి పిల్లలు కూడ లేరు.దాతల సహాయంతో వీరికి నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. కుటుంబానికి అర్.ఎస్ న్యూరో మల్టీస్పెషాల్టీ హాస్పటల్ రాజమండ్రి అండ్ ఆర్ ఎస్ స్వేచ్ఛ సోసైటీ యాజమాన్యం వారు సహాయార్థం కార్యక్రమం నిర్వహించారని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తెలిపారు.ఈ కార్యక్రమం లో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు ఆర్థిక సహాయం అందించిన దాతలకు అందరి తరుపున ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## సునామీలతో మానవాళికి ముప్పు

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్రకారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%-%6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్‌తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ ఫోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని పరిహారం ఉండాలి

మొంథా తుఫాన్ రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసింది. అపారంగా పంటలకు నష్టం జరిగింది. రోడ్లు, భవనాల శాఖకు, విద్యుత్ సంస్థకు అపార నష్టం జరిగింది. నదులు, వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగి అనేక చోట్ల గండ్లు పడ్డాయి. వందలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అనేక ఇళ్లు నేల కూలాయి. వేల కోట్లలో నష్టం జరిగింది. తెలంగాణలో వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, హనుమకొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, జనగాం, కరీంనగర్ మొదలైన జిల్లాల్లో 2.5 లక్షల ఎకరాల్లో వరి, 1.51 లక్షల ఎకరాల్లో పత్తితో పాటు మిర్చి, మొక్కజొన్న మొదలైన పంటలు 5 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. క్షేత్రస్థాయి పరిశీలనలో పంటల విస్తీర్ణత ఇంకా ఎక్కువగా ఉంటుంది. పంట నష్టంతోపాటు రెండు డిస్కింల పరిధిలో విద్యుత్ సంస్థకు 10 వేల కోట్ల దాకా నష్టం జరిగింది. 4,576 కిలోమీటర్ల మేర రహదార్లు దెబ్బతిన్నాయి. 302 కల్వర్టులు ధ్వంసమయ్యాయి. రహదారుల మరమ్మతులకు 2,713 కోట్ల అవసరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ వల్ల జరిగిన మొత్తం నష్టం రూ. 5,265 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. నష్టం ఇంకా పెరుగుతుంది. తెలంగాణలో పంట కాల్వల, మురుగు కాల్వల నిర్వహణ సరిగా లేకపోవటం, ముళ్లకంపలు, పూడికలతో కాల్వలు నిండి ఉండటం వల్ల వరదలు, భారీ వర్షాలు వచ్చినప్పుడు కాల్వలకు గండ్లు పడి పంటలు ముంపునకు గురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలే లేవు. తెలంగాణ ప్రభుత్వం ఎకరా పంటకు నష్ట పరిహారంగా 10 వేల రూపాయలు ప్రకటించింది. ఇది రైతుకు ఊరటనివ్వదు. ఎకరా సేద్యానికి రూ. 35 వేలకు పైగా రైతు పెట్టుబడి పెట్టాడు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పరిహారం రైతు నిలదొక్కుకోవటానికి ఉపయోగపడదు. రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని కనీసం ఎకరాకు రూ. 20 వేల పరిహారం ఇవ్వాలి. కౌలు రైతులకు పరిహారమే లభించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు మొదలగు జిల్లాల్లో మొంథా తుఫాన్‌వల్ల లక్షా, 38 వేల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని, 12,215 హెక్టార్లలో ఉద్యాన వన పంటలు దెబ్బతిన్నాయని, ఆక్వారంగంలోని 32 వేల ఎకరాల్లో రైతాంగం నష్టపోయారని, 2,261 పశువులు చనిపోయాయని, 4,794 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్ల, కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయని, 311 కల్వర్టుల, వంతెనలకు నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థకు అపారంగా నష్టం జరిగిందని, మొత్తం నష్టం 5,244 కోట్ల రూపాయలుగా ప్రాథమిక అంచనాను కూటమి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. క్షేత్ర స్థాయి పరిశీలనలో నష్టం చాలా ఎక్కువ ఉండే పరిస్థితి ఉంది. అనేక చెరువులు, వాగులకు గండ్లు పడి పంటలతోపాటు వందలాది గ్రామాలు నీటమునిగాయి. అనేక



చోట్ల రాకపోకలు స్తంభించి పోయాయి. వరదలకు కొద్ది మరణాలు సంభవించాయి. ఆంధ్రప్రదేశ్‌లో పంటల నష్టంపై భిన్నాభిప్రాయా లున్నాయి. 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం పంట నష్టాన్ని తక్కువ చేసి చెబుతుందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పంట నష్టం తక్కువగా చెప్పడం ద్వారా రైతులకు నష్టపరిహారం కింద ఇచ్చే మొత్తాన్ని తగ్గించుకోవడం కోసమేననే అభిప్రాయాలు వస్తున్నాయి. పంటలు కోల్పోయిన రైతాంగానికి ఇచ్చే పరిహారం కూడా, వారికి ఊరట ఇవ్వటం లేదు. రైతు ఇప్పటికే ఎకరాకి రూ. 35 వేలు దాకా సేద్యానికి పెట్టుబడి పెట్టాడు. కౌలు రైతులు అదనంగా మరో రూ. 15 వేలు కౌలు రూపంలో చెల్లించాడు. ప్రభుత్వం ప్రకటించే నష్ట పరిహారం ఎకరాకు ఎంత అన్నది ఇంకా ప్రకటించలేదు. కనీసం ఎకరాకి రూ. 20 వేలు నష్ట పరిహారం ప్రకటించాలి.

కౌలు రైతులకు నష్ట పరిహారం సమస్యగా మారింది. వైసిపి పాలన కాలంలో పంటల బీమా పథకానికి ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించడం వల్ల పంట నష్టానికి కొంత మేరకు పరిహారం అందేది. కారణం తెలియదు గాని చంద్రబాబు ప్రభుత్వం రైతాంగం తరపున ఈ సంవత్సరం ప్రీమియం చెల్లించలేదు. ఫలితంగా బీమా సంస్థల నుంచి రైతాంగానికి పరిహారం లభించక నష్టపోతున్నారు. బీమా పరిహారం లభించి ఉంటే, అది రైతుకు ఉపయోగం ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇప్పటికే రైతులకు రూ. 595 కోట్లు కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సిఉంది. పంటలు ముంపునకు గురైనప్పుడు, రైతాంగం నుండి ఎటువంటి వంకలు పెట్టకుండా మద్దతు ఇచ్చి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలి. మొంథా తుఫాన్ గురైన రైతుల నుండి పంట కొనుగోళ్లు చేయాలంటే, పంట నష్ట పరిహారం కోసం పేర్లు నమోదు చేసుకోరాదని, చేసుకుంటే నష్ట పోగా మిగిలిన పంటను మిల్లర్లు ఇచ్చే రేటుకు అమ్ముకోమని, కొనుగోలు కేంద్రాల్లో కొనే అవకాశం లేదని అధికారులు కొన్ని ప్రాంతాల్లో రైతులకు తెగేసి చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముంపునకు గురైన పంటలకు మద్దతు ధర ఇచ్చే అవకాశం లేదని మిల్లర్లు చెబుతున్నారు. అలాంటప్పుడు మిల్లర్లు ఇచ్చిన ధరకే రైతులు అమ్ముకోవాలి. ఫలితంగా రైతు తీవ్రంగా నష్టపోతాడు. రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ప్రతి సంవత్సరం సంభవిస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరదలు రావటానికి, పంటలు ముంపుకి గురి కావటానికి కారణమైన నదుల, వాగుల, కాల్వల, చెరువుల కరకట్టలను పటిష్ట చేయడం, పూడికలు తీయడం, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చు. వీటి పట్ల రాష్ట్ర పాలకులు దృష్టి పెట్టకపోవడం వల్ల తుఫాన్ల సందర్భంగా పంటలకు అపార నష్టం జరుపుతున్నది. రెండు రాష్ట్రాల్లో తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతాంగం, మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయి మరింత సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. కౌలు రైతులతోసహా నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ. 20 వేలు ఇవ్వాలి. ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతుల నుండి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులు ఇచ్చిన పంట రుణాలు రద్దు చేయాలి. పంటకాల్వల, డ్రైనేజీ కాల్వలను ఆధునీకరణ చేయాలి. సహాయం పొందడం పాలకుల భిక్షకాదని, అది తమ హక్కు అని రెండు రాష్ట్రాల రైతాంగం సాధనకు ఉద్యమించాలి.

# సాహితీ మహారథి దాశరథి

"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాదు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా ) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్' అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150



మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. "అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు. రుద్రవీణ, మహాంధ్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం ). మస్తిష్కంలో లేబరేటరీ ( విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది %-% దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు%Ô% అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణ కోటి రత్నాల వీణ." (అగ్నిధార ) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి%Ô%. తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే". కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును.."అనాదిగా సాగుతోంది - అనంత సంగ్రామం / అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య". ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి"...గతాన్ని కాదనలేను - వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను %-% కాలం నాకంఠమాల"... హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

# విశ్వం వాయిస్

VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

బుధవారం, 05 నవంబర్ 2025

www.viswamvoice.com






## కలెక్టరేట్ నందు కెరీర్ గైడెన్స్

# ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కెరియర్ కౌన్సిలింగ్ గైడెన్స్ ప్రక్రియ 8,9,10 తరగతుల విద్యార్థులకు విభిన్న రంగాలలో కెరియర్ ఎంపిక, భవిష్యత్తు కొరకు దిక్సూచిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు కెరీర్ గైడెన్స్ ఓరియంటేషన్ కార్య క్రమం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో ప్రతి పాఠశాల నందు కెరీర్ ట్రీ ప్రింటింగ్ చేయించి ప్రాథమిక దశలో అవగాహన పెంచాల న్నారు. రెండవ దశలో కరప త్రాలను బుక్లెట్లు ముద్రించి ప్రచారం కల్పిస్తూ భవిష్యత్తు కోర్సుల ఎంపిక, ఆసక్తి ఉన్న కోర్సుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. మూడో దశలో ఆన్లైన్ పోర్టల్ ద్వారా విస్తృతంగా ఉన్న అవకాశాల పట్ల సమగ్రమైన అవగాహ నను కల్పిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయంతో మార్గనిర్దేశం చేయాలన్నారు నవంబరు 30 నాటికి ప్రతి పాఠశాలకు పక్షం రోజులకు ఒకసారి కెరీర్ కౌన్సిలింగ్ క్లాస్ నిర్వహిం చేలా విధివిధానాల కార్యాచరణ ప్రణాళికలను రూపొందిం చాలన్నారు. తద్వారా విద్యార్థినీ విద్యార్థులు కెరీర్ ఆప్షన్లు ఎంపిక చేసు కోవాల్సి ఉంటుందన్నారు జీవితాన్ని ప్రభావి తం చేసే అంశాల్లో ఎంచుకున్న వృత్తి ప్రధానమైనదన్నారు. ఆనందంగా జీవించడం అందరి లక్ష్యం కావాలన్నారు. వృత్తి మన ప్రవృత్తికి సరిపడినదయితే ఆనందంగా జీవించగలుగుతామన్నారు మన అభిరుచికి నైపుణ్యానికి తగిన వృత్తిని ఎంపిక చేసుకోవ డానికి సరైన సమాచారాన్ని మార్గనిర్దేశి నాన్ని కెరీర్ గైడెన్స్ ద్వారా పొందాలన్నారు అందుకే కెరీర్ గైడెన్స్‌ను ఒక వ్యక్తి యొక్క పూర్తి జీవితానికి మార్గదర్శిగా చెప్పవచ్చు నన్నారు. పాఠశాల స్థాయిలో కెరీర్ గైడెన్స్ సేవలను ప్రవేశపెట్టి నిర్వహించడం ద్వారా విద్య, ఉపాధిని సులభతరం చేయడం, పని వాతావరణంలోని మారుతున్న పరిస్థితులకు, అవసరాలకు తగినట్లుగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించి 21 వ శతాబ్దపు ప్రపంచంలో పౌరులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత జీవన ప్రమాణాలు పెంపొందించుటలో కెరీర్ గైడెన్స్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తూ విద్య, ఉపాధి రంగాల మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. డీఈవో షేక్ సలీం భాష ప్రసంగిస్తూకెరీర్ గైడెన్స్ రిసోర్సు పుస్తకం ద్వారా విద్యార్థులు వారి యొక్క కెరీర్ను ఎంపిక చేసుకోవ డానికి అవసర మైన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, అర్హతలను తెలుసుకుంటారన్నారు. విద్యార్థులకు వారి పట్ల సానుకూల దృక్పథం పెం పొందడానికి వారిలో ప్రేరణ కలిగించు టకు, కెరీర్ పట్ల బాధ్యతగా వ్యవహరించుటకు అలాగే వ్యక్తిగత, సామాజిక అంశాల పట్ల ధైర్యంగా వ్యవహరిస్తూ నిర్ణ యాలు తీసుకోవడాన్ని కెరీర్ గైడెన్స్ సులభ తరం చేస్తుంద న్నారు. విద్యార్థులు వారి అభిరు చికి తగిన కెరీర్ని ఎంపిక చేసుకొని నచ్చిన వృత్తిలో కొనసాగుతూ ఆనందంగా జీవించాల న్నారు. ప్రాధాన్యతలు, శాస్త్రీయ దృష్టిలో అవకాశాలు, విద్యా, శిక్షణ అవసరాలు వంటి విష యాలను వివరించడంలో ఈ గైడెన్స్ ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్య అభివృద్ధి కమ్యూనికేషన్, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాలు వృత్తి మార్గాలు, వృత్తి నేపథ్యం, అవకాశాలు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు కెరియర్ సంబంధిత సమాచారం, వెబ్సైట్స్, సంస్థలు, ఆన్లైన్ టెస్ట్స్, హ్యాండ్‌బుక్‌లు సూచనలు ఇంట్రెస్ట్, ఆప్టిట్యూడ్ అనుసరించి కెరియర్ ఎంపికలో సహాయ పడుతుందన్నారు ప్రత్యామ్నాయ వృత్తుల గురించి అవగాహన నేర్చుకునే అవకాశాలు ఎక్కడ ఉన్నది తెలుస్తాయ న్నారు. విద్యార్థుల వైవిధ్యం, సామా జిక–ఆర్థిక స్థితి, లింగం, తల్లి దండ్రుల పిల్లల అభిప్రాయాలు మొదలైనవి కెరియర్ ఎంపిక చేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయన్నారు ఈ కార్యక్ర మంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి బి వి సుబ్రహ్మణ్యం, మామిడికుదురు పూర్వపు విద్యార్థి పి నవీన్, ప్రధానోపాధ్యా యులు చిరంజీవి, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# విలువిద్య పోటీలలో రాష్ట్రస్థాయికి ఎన్నికైన శ్రీవాగ్దేవి విద్యార్థులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వీరాపురంలో ఆర్ఆర్‌బిఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మాజీ ఎమ్మెల్యే వర్మ చేతుల మీదుగా జరిగాయి. ఈ పోటీలలో స్థానిక వడ్డిగూడెం నందలి శ్రీవాగ్దేవి పాఠశాల నుండి 10వ తరగతికి చెందిన డి.యస్. హర్షిత, 8వ తరగతికి చెందిన ఎ.హర్ష మణికంఠ, 6వ తరగతికి చెందిన డి.వెంకట హవాన్‌లు పాల్గొని చక్కటి ప్రతిభను కనబరచి తృతీయస్థానాన్ని గెలుచుకొని కాంస్యపతకంతో రాష్ట్రస్థాయికి ఎంపికయినారు. పోటీలలో పాల్గొన్న 150 మంది విద్యార్థులలో రాష్ట్రస్థాయికి ఎన్నికైన 36 మందిలో శ్రీవాగ్దేవి పాఠశాలనుండి పాల్గొన్న ముగ్గురు రాష్ట్రస్థాయికి ఎన్నికవడం గర్వకారణంగా ఉన్నదని పాఠశాలలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో పిల్లలను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు పరసా భరత్, ప్రిన్సిపాల్ దాత్రిష్టి శ్రీరామ చంద్రమూర్తి, హెడ్మాస్టర్ పిచ్చిక సుబ్రహ్మణ్యం, సాయి మార్షల్‌ఆర్ట్స్ ఫౌండర్ దేశంశెట్టి సాయి బాబు పాల్గొని విజేతలను అభినందించారు. అధ్యాపకులు, తోటి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా చక్కటి ప్రతిభను కనబరచి మంచి ఫలితాలను సాధించాలని ఆశిస్తూ అభినందనలు తెలియజేసారు.

# చెకుముకి సైన్స్ సంబరాలలో సాయితేజ ప్రథమస్థానం

### మండల స్థాయిలో సత్తాచాటి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

### మండల ప్రైవేట్ పాఠశాలల విభాగంలో తొలిస్థానం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల స్థాయిలో జరిగిన చెకిముకి సైన్స్ పోటీలలో సాయితేజా విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి, ప్రథమస్థానం సాధించడమే కాక, జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు సాయితేజా విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ కె.పద్మావతి తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు, మండల స్థాయి పోటీలలో భాగంగా, ప్రైవేటు పాఠశాలల విభాగంలో పోటీలు నిర్వహించగా, రాయవరం గ్రామానికి చెందిన సాయితేజా విద్యానికేతన్ ప్రథమ స్థానం సాధించి, జిల్లా స్థాయిలో లో జరిగే చెకుముకి సైన్సు సంబరాలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా సైన్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనుబరిచి, పాఠశాలకు వన్నె తెచ్చిన ఎనిమిదవ తరగతి విద్యార్థి సబ్బెల్ల హేమంత్ వీర వెంకటరెడ్డి, తొమ్మిదవ తరగతి విద్యార్థి ఏలేటి జోయ్, పదవ తరగతి చదువుతున్న విద్యార్థి నల్లమిల్లి విశ్వనాథ రెడ్డి లను రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పి.రామలక్ష్మణ మూర్తి, మండల విద్యాశాఖ అధికారి వై.సూర్యనారాయణ, సాయితేజ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ కె.పద్మావతి, అకడమిక్ డైరెక్టర్ కర్రి భానురేఖ సందీప్ రెడ్డి, పాఠశాల ఏవో పోలిమాటి సుధాకర్ అధ్యాపకులు, పలువురు అభినందించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

### మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు : రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు హెచ్చరిక




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి, అనపర్తి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 7 రోజుల జైలుశిక్షను విధించినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు మంగళవారం తెలిపారు. మండల కేంద్రమైన రాయవరంలో పోలీసులు ఇటీవల చేపట్టిన తనిఖీలలో, మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడిన సయ్యద్ కరీముల్లా కు అనపర్తి జె.ఎఫ్.సి మెజిస్ట్రేట్ 7 రోజులు జైలు శిక్ష విధించారని, రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అలాంటి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయాలి : డాక్టర్ పినిపే శ్రీకాంత్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం, ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాలలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహనరెడ్డి 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని,అందులో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభం అయ్యి పేద విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. అయితే ఈ కూటమి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు వైద్య విద్య ను అభ్యసించకూడదు అనే దురుద్దేశంతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి గుత్తేదారులకు అప్పగించాలని చూస్తుందని అది చాలా అన్యాయమని అన్నారు. ఈ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగన్మోహనరెడ్డి కోటి సంతకాల సేకరణ అనే కార్యక్రమం పెట్టి, కోటి సంతకాలు సేకరించి నవంబర్ 28,29 తారీకులలో గవర్నర్‌కి అందజేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అందరూ స్వచ్ఛందంగా సంతకాలు పెట్టి ఈ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, మల్లాడి ఉమామహేశ్వరరావు,వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, తిక్క ప్రసాద్, సర్పంచ్‌లు బర్రె సీతారత్నం, రాకాప విజయలక్ష్మి,పల్లి జేమ్స్, బళ్ళ శ్యామ్ కుమార్, మధుర శేఖర్, సాధనల శ్రీను, దేవరపల్లి నరేష్, పెనుమాల విక్రమ్, పెచ్చెట్టి వెంకటేశ్వరావు, విశ్వనాథపల్లి కామేశ్వరరావు, మధుర చాణక్య,రేవు సుందరరావు,పొన్నమండ జానకిరామయ్య, పొన్నమండ సత్తిబాబు, నల్లి వెంకటరమణ, వాకా నాగేశ్వరరావు, చిలకలపూడి యేసు, రాజు, వాసర్ల శ్రీను, గుబ్బల రాధా కృష్ణ, పొన్నమండ యేసు, నల్లి యేసు, పులుసుగంటి గంగాధర్, కొల్లు తాతారావు, గెద్దాడ కృష్ణ, బొంతు నాగరాజు, గంటా శ్రీనివాసరావు, బొంతు ఏడుకొండలు, పచ్చిమల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహేత శ్రీ బసవేశ్వర స్వామికి గజమాలతో అలంకరించిన అంజూరు శ్రీనివాస్ చౌదరి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో 14వ వార్డులో మున్సిపల్ లైబ్రరీ వెనక వేంచేసి ఉన్న మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహేత శ్రీ బసవేశ్వర స్వామి ఆలయంలో పట్టణ ప్రముఖులు అంజూరు శ్రీనివాస్ చౌదరి గజమాలను భక్తిశ్రద్ధలతో స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వెలిచిన స్వామి చాలా మహిమ గల స్వామి అని భక్తిశ్రద్ధలతో కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలిచి కోరిన కోరికలు తీర్చే మహిమగల దేవుడని ఆయన అన్నారు.ఆలయ కమిటీ వారు శ్రీనివాస్ అందించిన గజమాలను ఆ భగవంతుడికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. అనంతరం శూలాల సంబర వీరనాట్యాన్ని జరుపుతున్నారు.

# స్వదేశీ వస్తువులను మాత్రమే భారతీయులు వాడాలి..

### విదేశీ వస్తువులను బహిష్కరించాలి : బీజేపీ నాయకులు యాళ్ల దొరబాబు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగలమూరు గ్రామంలో ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ స్వదేశీ నినాదం మన జీవన విధానం కార్యక్రమం మండల అధ్యక్షులు కట్ట నారాయణమూర్తి అధ్యక్షతన ఆయన స్వగృహం వద్ద సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు మాజీ యాళ్ళ దొరబాబు, మండల ఇన్చార్జి, మాజీ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాళ్ల దొరబాబు మాట్లాడుతూ స్వదేశీ వస్తువుల్ని భారతీయులందరూ వాడాలని, విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశానికి సమకూర్చాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని ఆయన కోరారు. అల్లవరం మండలంలో మంగళవారం నాలుగు శక్తి కేంద్రాలని నియమించడం జరిగిందన్నారు. మోకా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ అల్లవరం మండలంలో బిజెపి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కూటమిలో కార్యకర్తలు భాగస్వామి గా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వపు రాష్ట్ర మీడియా ఇంచార్జ్ వల్లూరి నాని, జిల్లా కార్యదర్శి రేకాడివర్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర సాయి, అల్లవరం మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయ వర్మ, గుడాల పుల్లయ్య శెట్టి, వాసర్ల వెంకటేశ్వరరావు, కట్టా జనార్ధన్, బాలం నాగ సత్యవతి ,చిట్టూరి కుమారి, కట్ట రామ సీత, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టువ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమాలు

### నవంబర్ 17 నుంచి పక్షం రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు
### జిల్లాను కుష్టువ్యాధి రహితంగా తీర్చిదిద్దాలి
### వివక్ష లేకుండా వ్యాధిని గూర్చి సమాచారం అందించడమే కార్యక్రమ ఉద్దేశ్యం
### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ను కుష్టివ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తం గా నవంబర్ 17 నుంచి స్పర్శ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమం చేపట్టాలని, పక్షం రోజులపాటు నిర్వహించే ప్రచార గోడ పత్రికను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కుష్టు వ్యాధి లక్షణాలతో ఉన్న రోగులను సకాలంలో గుర్తించి, వైద్య సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజలలో కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుతూ, సమాజంలో వివక్ష లేకుండా వ్యాధికి సంబంధించిన సమాచారాన్నిఅందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధి గుర్తిస్తే చికిత్స తో సరి చేసుకోవచ్చునన్నారు, ప్రభుత్వ వైద్య సిబ్బంది ద్వారా నిర్వహించబడే ఈ కార్యక్రమంలో ప్రజలు వైద్యసేవలతో పాటు సరైన సలహాలు పొందగలుగుతారన్నారు. ప్రత్యేక అవగాహన సదస్సులు, వైద్య పరీక్షా క్యాంపులు నిర్వహించి, మల్టీడ్రగ్ థెరపీ ద్వారా చికిత్స ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, స్థానిక ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది సహకా రంతో పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కుష్టు లక్షణాలు ఉన్న వారికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. ప్రజలలో కుష్టు వ్యాధి పట్ల అపోహలు నివారించడం, సమాజంలో వారి పట్ల వివక్షత చూపకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం అదనపు డిఎం అండ్ హెచ్వో భరత్ లక్ష్మి మాట్లాడుతూ, స్పర్ష కుష్టు వ్యాధి అవగాహన ప్రచారం నవంబర్ 17 నుండి 30 వరకు నిర్వహిస్తూ, కుష్టు వ్యాధి మైకో బాక్టీరియా, లెప్రె అను బాక్టీరియా ను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ క్రిములు తుమ్మడం వలన, దగ్గడం వలన వ్యాప్తి చెందుతాయని వ్యాధి లక్షణాలు కనిపించుటకు 3 నుండి 5 సం? పట్టవచ్చుని వివరిస్తూ, వ్యాధి నిర్ధారణకు పలు సూచనలు చెప్పారు. ముఖ్యంగా శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మముపై రాగి రంగు మచ్చలు,పొడలు. లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు కాళ్లు చేతుల కండరాలలో బలహీనత వస్తుందన్నారు, చేతులు నరములలో తిమ్మిర్లు గా అనిపిస్తుందన్నారు. కళ్ళు పూర్తిగా మూసుకోలేకపోవడం చెవి తమ్మెలు మందంగా మారి పోవడం జరుగు తుందన్నారు. చర్మము పై చెవి తమ్మెల పై బుడిపెలు వస్తాయన్నారు. అపోహలను తొలగిస్తూ కుష్టువ్యాధి బారిన పడిన ఏ ఒక్కరూ వెనుకబడి పోకుండా చూడాలన్నారు. ఈ లక్ష ణాలు ఏవైనా ఉంటే వెంటనే వైద్య పరీక్ష చేయించుకోవాలని ఆమె సూచించారు.

# సైన్స్ దృక్పథంతో విద్యార్థుల పురోగతి

### జనవిజ్ఞాన వేదిక



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** చెకుముకి సైన్స్ సంబరాలు కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక రావులపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ బాధ్యులు శ్రీ లింగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( బాలికల) నందు దివి 4/ 11 /25 న మండల స్థాయి సైన్స్ టెస్ట్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమనకు ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) విద్యా కమిటీ చైర్మన్లు నందం సత్యనారాయణ మరియు సోమేశ్వరరావు హాజరైనారు. మరొక ముఖ్య అతిథి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు హాజరైనారు. వీరు మాట్లాడుతూ సైన్స్ అనేది ఎక్కడో లేదు మన చుట్టూ నిత్యజీవితంలో జరుగుతున్న పరిణామాలను సైన్స్ తో ముడిపడి ఉన్నాయి. వాటిని విద్యార్థిని విద్యార్థులు బాగా నిశితంగా పరిశీలించి తెలుసుకోవాలని చెప్పారు. అలాగే శ్రీ నందం సత్యనారాయణ బాల బాలికలు బాగా చదువుకుని ఐఏఎస్ ఐపీఎస్ వంటి ఉన్నతమైన కేడర్లకు వెళ్లాలని తెలిపారు. అలాగే శ్రీ సోమేశ్ మాట్లాడుతూ మూఢవిశ్వాసాలను అంద విశ్వాసాలను విడనాడి ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్‌గా ఎదగాలని తెలిపారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీ సర్వారాయుడు మాట్లాడుతూ గ్రహణాలు అవి ఎట్లా ఏర్పడుతున్నాయో వివరంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైవిఎస్ఎన్ బాలాజీ, మండల బాధ్యులు గిరి, దుర్గాప్రసాద్, సోమేశ్వరరావు, శ్రీధర్ మరియు మరి కొంతమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మరియు ప్రైవేటు పాఠశాలల నుండి మొదటి స్థానం పొందిన వారు శ్రీ సిద్ధార్థ స్కూల్ రావులపాలెం, మరియు ప్రభుత్వ పాఠశాల నుండి విజేతలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల ) రావులపాలెం వారు విజేతలుగా నిలిచారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు పాలుకోవాల్సి ఉంటుంది.

## ద్వారపూడిలో ఆటో ఢీకొని

# మోటర్ సైక్లిస్ట్ మృతి



**ద్వారపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్వారపూడి శివారు వేములపల్లిలో మంగళవారం ఆటో బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో మోటర్ సైక్లిస్ట్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఇప్పనపాడుకు చెందిన ఇందల దుర్గా సూరిబాబు (28) మృతి చెందారు.పోలీసులు కథనం మేరకు సూరిబాబు స్నేహితుడు రాజుతో కలిసి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తలకు తీవ్ర గాయం కావడంతో సూరిబాబు మృతి చెందగా రాజు కు గాయాలయ్యాయి. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

# గిరి ప్రదక్షిణకు రూ.30 వేలతో మజ్జిగ వితరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాసం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా నిండు పౌర్ణమి బుధవారం శ్రీసత్యదేవుడు, రమాదేవిల గిరిప్రదక్షిణ యాత్ర అంగరంగవైభవంగా జరుగనుంది. ప్రతీ ఏటా నిర్వహించే గిరిప్రదక్షిణ యాత్ర ఒక ఎత్తు అయితే ఈ ప్రదక్షిణ పాదయాత్రలో పాలుపంచుకునే భక్త జనుల అన్నార్తిని, దాహార్తిని తీర్చేందుకు చేసే ఏర్పాట్లు మరొక ఎత్తు. భక్తజనం ఆకలి దప్పికలను ఇటు దేవస్థానం, అటు దాతలు కూడా సాయం అందిస్తూ ఉంటారు. మరి కొందరు ఔత్సాహిక దాతలు స్వామి అమ్మ వార్లపై భక్తితో భక్తులకు నేరుగా సేవ చేయాలనే కుతూహలంతో పండ్లు, పాలు, వివిధ ఆహార పదార్థాలు, తాగునీరు, చల్లటి చల్లనూ పంపిణీ చేస్తూంటారు. ఈ కోవలోనే కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ సేవా స్ఫూర్తితో విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు, శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు జనసేన పార్టీ అధ్యక్షుడు గొర్లి నాగేశ్వరరావు కూడా తన వంతు ఉడతా భక్తిగా రూ.30,000 వ్యయంతో మజ్జిగ వితరణను చేయడానికి శ్రీ స్వామి, అమ్మవార్లకు సమర్పించుకున్నారు. ఇందుకు స్వచ్ఛమైన పాలు, పెరుగుతో తయారు చేసిన మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లను చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే గిరిప్రదక్షిణ మార్గంలో మజ్జిగను అందుబాటులో ఉంచేందుకు గొర్లి నాగేశ్వరరావు, ఆయన జనసైనికులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# అనారోగ్య బాధితులను పరామర్శించిన జనసేన నేతలు






**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల తలకు గాయమై చికిత్స చేయించుకొని ఇంటి వద్దనే వైద్యం పొందుతున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన వృద్ధురాలు నల్లల అనంతలక్ష్మిని జనసేన పార్టీ నేతలు, విజయవాడ ప్రాంతీయ రైల్వే వినియోగదారుల సలహా మండలి సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా టెలీకమ్యూనికేషన్స్ సలహా మండలి సభ్యులు మేకల కృష్ణ, జనసేన కాకినాడ పార్లమెంటరీ ఎన్నికల కమిటి సభ్యులు రావూరి వెంకటేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. ముందుగా ఈ నేతలు ముగ్గురూ కత్తిపూడి జనసేన పార్టీ కార్యాలయం నుంచి నేరుగా నెల్లిపూడికి మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుని అనంతలక్ష్మిని పలుకరించి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. ఆమెకు ఇంకా వైద్యం అవసరమైతే జనసేన పార్టీ తరఫున తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ అనంతలక్ష్మి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి నల్లల రామకృష్ణ మాతృమూర్తి కావడం విశేషం. ఇదే మండలంలోని మండపం గ్రామ జనసేపార్టీ నాయకులు పోలం వెంకటరత్నం కాలుకి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద వైద్యసహాయం పొందుతున్న పోలం వెంకటరత్నంను కూడా ఈ నాయక త్రయం పరామర్శించింది. ఆపత్కాలంలో జనసేన పార్టీ అండగా ఉంటుందని పోలం వెంకట రత్నంకు నాయక త్రయం అభయం ఇచ్చింది.

# నిరుద్యోగులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ వికాస ద్వారా సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ ఇండియా క్యాంపస్ హెడ్ అయిన మెర్లిన్ మంగళవారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ కలిసి సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ ద్వారా కాకినాడలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే శిక్షణా కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదర్లాండ్ గ్లోబల్ కంపెనీ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను, ఇన్నోవేటివ్ ఐడియాలజి ద్వారా వివిధ ప్రాజెక్టను తయారు చేయడానికి ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా 60 రోజులపాటు శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం సర్టిఫికెట్తో పాటు వీరికి సదర్లాండ్ కంపెనీలోనే సం?రానికి సుమారు 2.5లక్షల నుండి రూ.3,5లక్షల వరకు జీతంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. కాకినాడలో మూడు ట్రైనింగ్ సెంటర్లతో పాటు ఇంక్యుబేషన్ ట్రైనింగ్ సెంటర్ను కూడా ఏర్పాటు చేసి కాకినాడను ట్రైనింగ్ హబ్ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ శిక్షణకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో వికాస మేనేజర్ పి. శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా సచ్చిదానంద వర్మ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా సంగాని సచ్చిదానంద వర్మ (ఎస్ఎస్ వర్మ) రానున్నారు. వర్మ గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో ఫైనాన్స్ విభాగం అదనపు కమిషనర్గా సుమారు మూడేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ నగర పాలక సంస్థకు ఇన్చార్జి కమిషనర్గా కేటీ సుధాకర్ బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్గా వర్మ ఈనెల 10వ తేదీ తర్వాత బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

### జేఎన్టీయూకే యూనివర్సిటీ విద్యార్థులకు

# డిజిటల్ అరెస్టులపై అవగాహన నిర్వహించిన జిల్లా ఎస్పీ




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్టీయూకే), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యు సి ఈ కే)లోని ఎన్ఎస్ఎస్ యూనిట్లు, కాకినాడ జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే.ప్రసాద్, కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.బిందు మాధవ్, కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పాటిల్ దేవరాజ్ మనీష్ హాజరై జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగం, సైబర్ నేరాలు మరియు మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. తాత్కాలిక ఆనందం కోసం తప్పు మార్గాలను ఎంచుకోవద్దు. ప్రతి విద్యార్థి నైతిక విలువలు, క్రమశిక్షణ మరియు సైబర్ అవగాహనతో ముందుకు సాగితేనే సురక్షిత సమాజాన్ని నిర్మించగలం" అన్నారు. విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ మరియు బెట్టింగ్ల బారిన పడకుండా పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాటిల్ దేవరాజ్ మనీష్ మాట్లాడుతూ "ప్రస్తుత తరుణంలో మత్తు పదార్థాల దుర్వినియోగం, సైబర్ నేరాలు మరియు మహిళలపై జరుగుతున్న దాడులు సమాజానికి తీవ్రమైన సవాళ్లు. విద్యార్థులు సాంకేతికతను సమాజ అభివృద్ధికి వినియోగించాలి కానీ నేరాలకు సాధనంగా మార్చకూడదు, ప్రతి విద్యార్థి చైతన్యవంతుడై, ఇతరులకు అవగాహన కల్పించే మార్గదర్శకుడిగా మారాలి" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జీ. శ్యామ్కుమార్, జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎన్. రమణాజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.వి.ఎస్.వి.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ పి.వీరలక్ష్మి, ఎన్ ఎస్ ఎస్ యూనిట్-3 ప్రోగ్రామ్ ఆఫీసర్ ల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ ఎన్.మోహన్‌రావు, యూసీఈకే ప్రిన్సిపల్, విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు, డైరెక్టర్లు, విద్యార్థులు మరియు జిల్లా పోలీస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రత్నగిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం...!

## కార్తీక పౌర్ణమితో 1 గంట నుంచే సర్వదర్శనాలు







**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈనెల ఐదో తేదీన బుధవారం నాడు కార్తీక పౌర్ణమి నాడు జరగబోయే గిరి ప్రదక్షణ ఏర్పాట్లపై మంగళవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రాజా ఐ.వి రోహిత్, నలుగురు డిప్యూటీ కమిషనర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గిరిప్రదక్షిణ కార్యక్రమం విజయ వంతం అయ్యేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. ఉదయం 8 గంటలకు స్వామివారి పల్లకీ ద్వారా, మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథం ద్వారా రెండు విడతలుగా గిరిప్రదక్షిణలో భక్తులందరూ పాల్గొనాలనీ, వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకూడదని, భక్తుల విస్తృత సౌకర్యాల కల్పనే అందరి లక్ష్యం కావాలి అన్నారు. ఈ సమీక్ష ద్వారా, కొండదిగువ గిరిప్రదక్షిణ, కొండపైన కార్తీక పౌర్ణమి ఏర్పాట్లపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**12 శిబిరాల్లో పండ్లు, ఫలహారాల ఏర్పాటు**

గిరిప్రదక్షిణ జరిగే రహదారుల ప్రక్కన మొత్తం 12 స్టాల్స్ ద్వారా పండ్లు, ఫలహారాలు, మజ్జిగ, మంచినీరు, పాలు, పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ నుంచి నాలుగు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన భక్తులకు వైద్య సేవలను అందజేస్తారు. తొలి పావంచాల నుండి గిరిప్రదక్షిణ ప్రారంభం అవుతుంది. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, సాక్షి గణపతి ఆలయం మీదుగా సాగి జాతీయ రహదారి మీదుగా బెండపూడి పోలవరం కాలువగట్టు రోడ్డు మీదుగా సుమారు పది కిలోమీటర్లు మేర సాగి దేవస్థానం పవర్ హౌస్ ప్రాంతానికి చేరుకోవడంతో ముగుస్తుంది. దారి పొడుగునా భక్తులకు అవసరమైన సౌకర్యాలు సిద్ధం చేసారు. మంగళవారం సాయంత్రం అధికార యంత్రాంగం మొత్తం ప్రత్యేక బస్సు ద్వారా బెండపూడి పోలవరం గట్టు రహదారిని మరోమారు పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసారు. గిరి ప్రదక్షిణ యాత్రలో ఎటువంటి తోపులాటలు, అపశృతులు ఎదురు కాకుండా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆద్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇద్దరు డిఎస్పీల నేతృత్వంలో 8 మంది సిఐలు, 16 మంది ఎస్ఐలు, 300 మంది పోలీసులతో పాటు దేవస్థానానికి సంబందించిన సెక్యూరిటీ సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటారు.

**కార్తీక పౌర్ణమికి విస్తృత ఏర్పాట్లు**

బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం రాత్రి నుండే రత్నగిరిపై ప్రత్యేక ఏర్పాట్లకు అన్ని విభాగాల సిబ్బందిని సంసిద్ధం చేసారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట నుండే వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించాలని ఆయా విభాగాల అధికారులను, ప్రధానార్చకులను, వ్రత పెద్దలను ఆదేశించారు. దర్శనం క్యూలైన్లలో భక్తులు నిలుచునే పరిస్థితి ఉండకూడదని, లైన్లలో భక్తులు కదులుతూ త్వరగా దర్శణం పూర్తి చేసుకునేలా ఉండాలి అన్నారు. ప్రత్యేక దర్శణాలు పూర్తిగా రద్దు చెయ్యాలని నిర్ణయించారు. దద్దోజనం పంపిణీ నిరంతరాయంగా జరగేలా చర్యలు చేపట్టారు. స్వామి వారి ప్రసాదాలు భక్తుల సంఖ్యకు తగ్గట్లు విక్రయ కేంద్రాల్లో సిద్ధం చేస్తున్నారు. రాత్రి పంపా హారతులు, జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సంప్రదాయబద్ధంగా చేపట్టుటకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొనాలని అధికారులు విజ్ఞప్తి చేసారు. అందరూ సమిష్టి కృషితో ఈ బృహత్కార్యాన్ని గట్టెక్కించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలుపులమ్మలోవ దేవస్థానం విశ్వనాథ రాజు, వాడపల్లి దేవస్థానం ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు, కాకినాడ దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ రమేష్ బాబు, అన్నవరం దేవస్థానం డిసి. బాబూరావు, ప్రధానార్ధకులు కోట సుబ్బయ్య, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, డిఇలు విశ్వనాధుల సత్యనారాయణ, పంచాది గుర్రాజు, సెక్యూరిటీ ఆఫీసర్ ఆకుల ప్రసాదరావు, పిఆర్వో అనకాపల్లి ప్రసాద్, వివిధ విభాగాల ఏఈఓలు దామెర కృష్ణారావు, ఎల్.శ్రీనివాస్, పెండ్యాల భాస్కర్, సూపరింటెండెంట్లు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లీ, కూతుళ్ళపై కొడవలితో దాడి – ఒకరి పరిస్థితి విషమం





**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో దుస్సంఘటన చోటు చేసుకొంది. మద్యం మత్తులో ఓ వివాహితుడు తన అత్త, వదినలపై కొడవలితో దాడి చేసి కలకలం రేపాడు. ప్రాథమిక వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమాలి గ్రామంలో రామకుర్తి అప్పలరాజు, భర్త సూరిబాబు (లేటు) వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె కేసనశెట్టి నాగదుర్గసాయికి మణికంఠ స్వామితోను, చిన్న కుమార్తె దుర్గాదేవికి కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన పెంటపాటి హరిబాబుతో రెండేళ్ల క్రితం వివాహం అయ్యింది. పెళ్లి తర్వాత కుటుంబ విభేదాల కారణంగా భర్త హరిబాబుతో కలిసి జీవించ డానికి దుర్గాదేవి నిరాకరించింది. దుర్గాదేవి తన భర్త నుంచి ఆరు నెలల క్రితం విడాకులు తీసుకున్నది. అనంతరం కానూరి సత్యను దుర్గాదేవికి ప్రేమ వివాహం చేసుకున్నది. ఈ నేపథ్యంలో దుర్గాదేవి మాజీ భర్త పెంటపాటి హరిబాబు మంగళవారం మద్యం మత్తులో అత్త ఇంటికి వచ్చి"కూతుర్ని తిరిగి కాపురానికి పంపకపోతే పెళ్లి ఖర్చులు తిరిగి ఇవ్వాలి" అంటూ అత్తతో వాగ్వాదానికి దిగాడు. ఆపై కోపోద్రిక్తుడై అక్కడే అందుబాటులో ఉన్న కొడవలితో అత్త రాపర్తి అప్పలరాజు మెడపై నరికాడు. అలాగే ఈ దాడి నుంచి తల్లిని కాపాడేందుకు అడ్డుకో బోయిన వదిన నాగదుర్గాసాయిని కూడా విచక్షణా రహితంగా కొడవలితో నరికాడు. ఈ దాడిలో తల్లీ, కూతుళ్ళు ఇద్దరికీ గాయాలు అయ్యాయి. దీంతో తిరుమాలి గ్రామానికి చెందిన స్థానికులు, బంధువులు కలిసి బాధిత మహిళలను హుటా హుటిన ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చి చేర్చారు. ఇక్కడ బాధితులకు అత్యవసర ప్రథమ చికిత్స వైద్య సేవలను అందించారు. అత్త రామకుర్తి అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వదిన దుర్గా సాయికి మాత్రం ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి, ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరిశీలించి, వారి నుంచి వాంగ్మూలాన్ని, కేసును నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

# ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు చంద్రబాబు...

## మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ - 33 మంది లబ్ధిదారులకి చెక్కులు అందించిన నాయకులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ అభివృద్ధి, సంక్షేమం అనే రెండుచక్రాలపై రాష్ట్రాన్ని నడిపించే నాయకుడని, ప్రజల సమస్యలను వినిపించుకుని, పరిష్కారం చూపే దిశగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు అనేక కుటుంబాలకు ఉపశమనంగా నిలుస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి అన్నారు. ప్రమాదవశాత్తు గాయపడి ప్రస్తుతం బెడ్ రెస్ట్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి.. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చెక్కులను వారి గ్రామాల్లోనే వారి ఇండ్లకు వెళ్ళి అందజేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ప్రజల కష్టాలు, అవసరాలు గుర్తించి సకాలంలో సహాయం అందించే నాయకత్వం అంటేనే చంద్రబాబు అని మరోసారి రుజువైంది. ఆయన ఆలోచనలతో స్ఫూర్తి పొంది ప్రజా సేవలో అచంచలంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ నియోజక వర్గ పరిధిలో 33 మందికి సుమారు రూ.20 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాయకుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా స్థానిక తెదేపా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఆ మార్గంలోనే మాజీ ఎమ్మెల్యే అనంత లక్ష్మి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని..ఆమె ప్రమాదవశాత్తు గాయపడి ప్రస్తుతం బెడ్ రెస్ట్‌లో ఉన్నప్పటికీ ప్రజా క్షేమం కోరుతూ లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చెక్కులను లబ్ధిదారులున్న గ్రామాల్లోనే వారి ఇండ్లకు వెళ్ళి అందజేయాలని పార్టీ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారని అందుకనుగుణంగా తమంతా కలిసి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించామని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న పలువురు లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ "మా కష్టాన్ని గుర్తించి సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కి,గాయపడినప్పటికీ ప్రజల పట్ల ప్రేమను చూపిస్తూ, ప్రజా క్షేమం కోరుతూ సేవా కార్యక్రమాలు ఆపని అనంత లక్ష్మి సేవా మనసును లబ్ధిదారులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

### నగర ప్రజలు 'పురమిత్ర' యాప్‌ను

# సద్వినియోగం చేసుకోవాలి : ఇన్‌చార్జ్ కమిషనర్ సుధాకర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పురమిత్ర' యాప్‌ను నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ కే.టి.సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్లే స్టోర్‌లో 'పురమిత్ర' యాప్ అందుబాటులో ఉందని, ప్రతి పౌరుడు దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా పౌరులు ఇంటి వద్ద నుంచే పలు ప్రభుత్వ సేవలను పొందవచ్చని, అలాగే తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ "ప్రజలు ఈ యాప్‌ను వినియోగించడం వల్ల సేవల అందజేత వేగవంతమవుతుంది. పారదర్శకత పెరుగుతుంది. అందరూ తప్పనిసరిగా 'పురమిత్ర' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని ఉపయోగించాలి" అని సూచించారు.

# డిసిసి బ్యాంక్ ఎంప్లాయిస్‌కి క్వార్టర్లీ ఇన్స్పెక్షన్ అనే అంశంపై శిక్షణా కార్యక్రమం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సహకార సంఘాల చట్టప్రకారం సొసైటీలు తనిఖీ చేయాలని సొసైటీలో ప్రతి రుణాన్ని రైతులకు అందేటట్లు సూపర్వైజర్లు సందర్శించినప్పుడు చూడవలసిన బాధ్యత డి సిసి బ్యాంక్ సూపర్వైజర్లకు ఉందని తద్వారా సొసైటీలలో జరిగే అవకతవకలను అరికట్టడానికి అవకాశం కలదనిడిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఏర్పాటు చేసిన డి సిసి బ్యాంక్ ఎంప్లాయిస్ కి క్వార్టర్లీ ఇన్స్పెక్షన్ అనే అంశం మీద స్వల్పకానికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు )హాజరై సొసైటీలలో తనిఖీ చట్టపరంగా బై లా ప్రకారంగా, రూల్స్ ప్రకారంగా చేయాలని అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, రికవరీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ఎన్‌పిఏ తగ్గించాలన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి అందరు కృషి చేయవలసిన బాధ్యత ఉన్నది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ పి ప్రవీణ్ కుమార్, డివిజనల్ సహకార అధికారి పీవీఎం కుమార్, జిల్లా ట్రైనింగ్ ఇంచార్జ్ ఆదిమూ లం వెంకటేశ్వరరావు, డీజీఎం శ్రీధర్ చౌదరి, ఎం సూర్యనారాయణ మూర్తి, వై రమేష్ డిసిసిబి సూపర్వైజర్లు బ్యాంక్ మేనేజర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో జంక్షన్లు, బిటి రోడ్లు అభివృద్ధి..

## నిర్మాణాత్మకంగా కార్యక్రమాలు చేయాలన్నదే తమ ఆలోచన : ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వెల్లడి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో కీలకమైన జంక్షన్లు, బిటి రోడ్ల అభివృద్ధికి 11కోట్ల రూపాయలతో ఈనెలాఖరు నాటికి టెండర్లు పిలవనున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. పనులు ఇప్పటికే ప్రారంభించాలని అనుకున్నప్పటికీ అకాల వర్షాలు, తుపానుల కారణంగా జాప్యం ఏర్పడిందన్నారు. అయితే ఇది సాకుగా చెప్పడం లేదని, బాధ్యతతో చెబుతున్నమాట అని అన్నారు. వర్షాల వలన రోడ్లు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే వాసు గుర్తుచేసారు. స్థానిక కంబాల చెరువు వద్ద ఇన్కమ్ టాక్స్ ఆఫీసు వద్ద రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పాట్ హెూల్ ఫ్రీ సిటీ కార్యక్రమాన్ని కూటమి నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, వై.శ్రీను, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులతో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ నగరంలో సుమారు 507 పాట్ హెూల్స్ ఉన్నాయని, అందులో బాగా దెబ్బతిన్న 79 ఫిల్ చేశామన్నారు. ఇంకా 428చేయాల్సి ఉందని, వాటిని ఈరోజునుంచి కంబాలచెర్వు నుంచి ప్రారంభిస్తున్నామని ఆయన చెప్పారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఎన్ క్యాప్ అనే నిధి ఉందని, దాని ద్వారా నగరంలో జంక్షన్లు, రోడ్ల అభివృద్ధి చేయాలని నిన్నటి రోజున ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్, ఇతర అధికారులతో కల్సి చేసిన సమీక్షలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే వాసు చెప్పారు. రూ. 95 లక్షలతో 12వ వార్డు సోమాలమ్మ టెంపుల్ రోడ్డు, రూ. కోటి 95 లక్షలతో వివెల్ పురం నుంచి జాతీయ రహదారి మీదుగా మోరంపూడి కనెక్ట్ చేసే రోడ్డు, రూ. కోటి 80 లక్షలతో బైబిల్ ప్లేస్ నుంచి ఆర్ట్స్ కాలేజీ మీదుగా వెళ్ళడానికి 2, 3, 4, 8 వార్డులకు సంబంధించిన బీటీ రోడ్డు, రూ. 46లక్షలతో సిటీఆర్ఐ జంక్షన్ నుంచి క్వారీ మార్కెట్ జంక్షన్ దాకా 49వార్డు పరిధిలో బిటి రోడ్డు, రూ. 90లక్షలతో 8వార్డు దానవాయిపేట డొమినోస్ నుంచి బైపాస్ రోడ్డు కనెక్టివిటీ బిటి రోడ్డు వేయబోతున్నట్లు ఎమ్మెల్యే వాసు వివరించారు. జంక్షన్స్ అభివృద్ధిలో భాగంగా జాగృతి బ్లడ్ బ్యాంకు రోడ్డు ఇప్పటికే మొదలు పెట్టామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. రూ 70లక్షలతో రామాలయం జంక్షన్, వివెల్ పురం జంక్షన్, రూ.98లక్షలతో 11వ వార్డు కెఎల్ఎం షాపింగ్ మాల్ తూర్పు వైపు రాజా స్ట్రీట్ నుంచి తిలక్ రోడ్డు వరకు, రూ.90లక్షలతో 9వ వార్డు జె ఎన్ రోడ్డు, అలాగే రూ 80లక్షలతో 10వ వార్డు గాదాలమ్మ రోడ్డు, రూ 83లక్షలతో 9వ వార్డు తారకరామా నగర్ రోడ్డు, రూ 26లక్షలతో నారాయణపురం నుంచి అవరోడ్డు నవంబరు చివరినాటికి టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఈ మేజర్ కనెక్టింగ్ రోడ్లు రూ 11కోట్లతో వేసే కార్యక్రమంతో పాటు మరోపక్క వర్షాల వలన పాడైన రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని కూడా చేపడతామన్నారు. గతంలో మాదిరిగా పెద్ద డివైడర్లు పెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే కార్యక్రమాలుండవని, అవసరమైన చోట చిన్న చిన్న డివైడర్లు పెడతామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇప్పటికే వర్షాల వలన పనులు ఆలస్యం అయ్యాయని, ఇప్పుడు వర్షాలు తగ్గినందున పనులుమొదలు పెడతామని ఆయన చెప్పారు. నిర్మాణాత్మకంగా కార్యక్రమాలు ఉండాలన్నదే తమ ఆలోచన అని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు తదితరులు ఆయన వెంట ఉన్నారు.


**మరీ ఇంతలా రాజకీయాలను దిగజార్చేస్తారా : భరత్ రామ్ తీరుపై ఎమ్మెల్యే వాసు మండిపాటు**

రాజకీయ విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన చెందారు. మరీ ఇంతలా రాజకీయాలను దిగజారేస్తారా అని ఆయన వాపోయారు. కల్పిత వీడియోలు... ఆడియోలు తీసుకువచ్చి రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే వాసు మండిపడ్డారు. అసలు ఆ ఆడియోలో ప్రస్తావించిన ఆ ఎమ్మెల్యే ఎవరు, నగరంలో ఎన్ని మద్యం షాపులు ఉన్నాయి... వాటి పని తీరు ఏంటనే విషయాలను చూసుకోకుండా కొంతమంది దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఇవన్నీ నిశితంగా గమనిస్తున్నారని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇటువంటి రాజకీయాలు చేసే 2024లో దెబ్బతిన్నారని ఆయన పేర్కొంటూ, ఇదే కొనసాగితే, 2029లో కూడా దెబ్బతింటారని ఆయన హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చి 15 నెలల్కొందని, తాము మాట్లాడుతున్న తీరు... గత ఐదేళ్లా వైకాపా వారు మాట్లాడిన తీరు ఎలా ఉందో ప్రజలందరూ భేరీజు వేసుకుంటున్నారని ఎమ్మెల్యే వాసు అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుని, తనను హేయమైన పదజాలంతో వ్యాఖ్యలు చేసారని, చివరకు చిన్న పిల్ల వాడ్కెన తన కుమారుడిని కూడా రాజకీయాల్లోకి లాగారని ఆయన గుర్తు చేశారు. అయితే భరత్ రామ్ తండ్రి మార్గాని నాగేశ్వరరావుది కూడా తన తండ్రి వయస్సు కాబట్టి ఆయన్ను తాను ఇప్పుడూ ఎప్పుడూ కూడా చాలా గౌరవంగానే సంబోధిస్తానని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేసారు. నగరంలోని 42 డివిజన్లలో తమ పార్టీ జెండాలు మోసే కార్యకర్తలు తనకు ఎప్పుడూ అండగా ఉంటారని, అందుకే తనకు బలం ఉందని ఆయన అన్నారు. ఏ వార్డో అతనే చెబితే తన క్యాడర్‌తో వస్తాను... భరత్ రామ్ తన క్యాడర్‌తో వస్తే ఎవరి దమ్ము ఏంటో తేల్చుకుందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సవాల్ విసిరారు. కోటి సంతకాల సేకరణ కోసం మనిషికి రూ. 100 ఇచ్చి తెచ్చుకునే నాయకత్వం భరత్ రామ్‌ది అని... తాను ఇచ్చిన పిలుపునకు ఎందుకు... ఏంటని అడగకుండానే వేలాదిగా తరలి వచ్చే క్యాడర్ తనకుందని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేశారు.

# ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలి

## విభిన్న పాత్రల్లో తన ప్రతిభను చూపిన చిరంజీవి 'అభి'












**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్రం తృతీయ వార్షికోత్సవ విజయోత్సవ కార్యక్రమంలో విభిన్న పాత్రలతో తన ప్రతిభను చాటుకున్న చిరంజీవి సిహెచ్.అభికి పలువురి ఆశీస్సులు అందించారు. వరుసగా మూడు రోజులు పాటు జరిగిన శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వాహికురాలు కళా తపశ్వి తణుకు సాయి మాధవి సారథ్యంలో గురువుల ప్రోత్సాహం తోను తన విధ్యార్థిణిల కళా నైపుణ్యంతోను ఎంతో అంగ రంగ వైభవొత్సవంగా వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఒక పరమ శివునిగాను, శ్రీ రాముడిగాను, శ్రీ కృష్ణ పరమాత్మునిగాను, అమ్మవారిగాను మరి కొన్ని విలక్షణ పాత్రలతో అబ్బుర పరిచిన చిరంజీవి 'అభి'ను పలువురు గురువులు, పెద్దలు, వీక్షకులు ప్రత్యేక అభినందనలతో ముంచెత్తారు. పెద్దల ఆశీస్సులు అందించారు. ప్రతి పాత్ర లోను పాత్రకు జీవం పోసిన "అభి" ప్రతిభను ఇంత గొప్పగా తీర్చి దిద్దిన శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర నిర్వహికురాలు తణుకు సాయి మాదవి కే అంకితం అని ఈ సందర్భంగా అభి తల్లిదండ్రులు వెంకట్, భవానీలు వారి ఆనందం వ్యక్త పరిచారు. కొన్ని విభిన్న పాత్రల్లో పార్వతి పరమేశ్వరుని గాను, సీతా రాములు గాను అభి - కిరణ్ మయ్‌లు ఎంతో నిండు తనంతో వారి కళా ప్రతిభను చాటుకున్నారు. వారి ఇరువురి కాంబినేషన్ అద్భుతం అని వీక్షకులు కితాబులు పలికారు. అభి - కిరణ్ మయ్‌లు ఏ పాత్రలో నైనా, నృత్యంలో నైనా లీనమై పోతారని. నటరాజుడు తాండవించే ఒక కళా కండం వారిలో కనపడుతుందని పలువురు చర్చించుకున్నారు. వార్షికోత్సవ సభలో "అభి" తోపాటుగా శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థిణిలు ఎవరికి వారు వారి నైపుణ్యాన్ని వివిధ పాత్రలతో వేదికను కళ కళ లాడించారు. ఇంత గొప్పగా కూచిపూడి కళను రాజమండ్రిలో అభివృద్ధి పరుస్తు జాతీయ స్థాయిలో అనేక విజయాలను సొంతం చేసుకున్న తణుకు సాయి మాదవి సేవలను కూచిపూడి కళా ప్రియులు ఎన్నటికీ మరువలేరని ఆమె సేవలను, ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు. ముందు ముందు శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్రం నిర్వహికురాలు తణుకు సాయి మాధవి ప్రతిభ మరియు ఆమె తీర్చి దిద్దిన విద్యార్థిణిలకు జాతీయ స్థాయిలో గౌరవ ప్రతిష్టత్మమైన గుర్తింపు దక్కటం ఖాయమని విచ్చేసిన పెద్దలు ఆశాబావం వ్యక్త పరిచారు.

# టిడిపి ఎస్.సి మండల కమిటీ అధ్యక్షులుగా పెనుముచ్చు రాజ్ కుమార్









## - ప్రధాన కార్యదర్శిగా కత్తుల రాజు

**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ఆదేశాల మేరకు దేవీపట్నం మండల అనుబంధ సంఘాల ఎస్సి కమిటీ సభ్యులను నియమించడం జరిగిందని మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. మండల ఎస్సి కమిటీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన కార్యదర్శిగా కత్తుల రాజు, ఉపాధ్యక్షులుగా మాకారపు వాసు, చవల ఏసుబాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీనుబాబు, దారా శివయ్య, కొల్లి సత్యనారాయణ, కార్యదర్శులుగా మిరియాల రత్న మౌళి, కొల్లి నాగేశ్వరరావు, కంచుమర్తి పోచమ్మ, సభ్యులుగా పెనుముచ్చి శైలజ, దేవరపల్లి సీతాలు, మైలవరపు పాపమ్మ, మిట్టపల్లి జారీజ, మైలవరపు కృపమ్మలను నియమించామని తెలియజేశారు. ఈ నియామకాల పట్ల నూతనంగా నియమితులైన సభ్యులందరూ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు, రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష దేవి నియోజవర్గ పరిశీలకులు కొల్లు బోయిన శ్రీనివాస్ యాదవ్ దేవీపట్నం మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మండల నాయకులు అందరికి కూడా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. అంతేకాకుండా టిడిపి పార్టీకి, ఇచ్చిన పదవికి న్యాయం చేస్తామని పార్టీ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకొని వెళ్తు అందరికి అందుబాటులో ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో హడక్ కమిటీ సభ్యులు మాజీ మండల అధ్యక్షులు ముండ్రు మధుసూదన్ రావు, తైలం గంగాధర్, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, కొండ్ల చిన్న కొండారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జొన్నల రాంబాబు(నాని), ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, కేశవరపు చంద్ర కుమార్(పండు), మాజీ తెలుగు యువత కార్యదర్శి చవలం శివరామకృష్ణ, అరకు పార్లమెంటు బీసీ ఉపాధ్యక్షులు ముచ్చు నాగేశ్వరరావు, అడబాల వీరభద్రరావు, మండల బీసీ అధ్యక్షులు ముచ్చు త్రిమూర్తులు, సొసైటీ డైరెక్టర్ పల్లపాటి నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్, పేరుగాని ఏసు, ఈత శివాజీ, కాసాని వెంకటేశ్వరరావు, మట్ట నరసింహమూర్తి(కాపు), కొత్తపల్లి సత్యనారాయణ, కారం పోచమ్మ, పుట్టపల్లి మల్లేష్, కర్రి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి

## ఓకల్ ఫర్ లోకల్ కార్యక్రమంలో ఇంటింట ప్రచారంలో బీజేపీ నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు 5వ మండల బీజేపీ అధ్యక్షులు కమలేష్ జైన్ ఆధ్వర్యంలో ఓకల్ ఫర్ లోకల్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా స్వదేశీ నినాదంతో ఇంటింటికి వెళ్లి స్వదేశీ వస్తువులు వినియోగాన్ని ప్రోత్సహించాలని ప్రజల్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జిగా పరిమిరాధా, కో-ఇంచార్జ్ గా వీరా వీరాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూర రామచంద్రరావు, కురగంటి సతీష్, లలిత్ జెన్, పిల్లాడి రుద్రయ్య, కే.లక్ష్మి, రుక్కు పి.పవన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రజల ఆస్తి.. ప్రజలే కాపాడుకోవాలి...







## ప్రజలందరు ఈ ప్రక్రియను వ్యతిరేకించాలి.. - మద్యం షాపులపై ఎమ్మెల్యేకు నెలకు రూ.60 లక్షల ఆదాయం

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి కోటి సంతకాల సేకరణ - రచ్చబండ కార్యక్రమంలో మార్గాని, రౌతు, గూడూరి విమర్శ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు లక్ష కోట్లు ఆస్తి అని వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్ర చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ అన్నారు. మంగళవారం వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, వైసిపి నాయకులు మార్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ లో భాగంగా స్థానిక 13వ వార్డులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తో పాటు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ రావు, వైసిపి రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లతో వైఎస్సార్సీపీ నాయకులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి, పేదల పిల్లలకు వైద్య విద్య అందుబాటులో ఉంచాలని లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారని అన్నారు. వాటి విలువ సుమారు లక్ష కోట్లు ఉంటుందని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను చంద్రబాబు బినామీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వైద్య విద్యను వ్యాపారం చేయడానికే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారని అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజ్ 36 ఎకరాలు స్థలమని తెలిపారు. భూమి ఒక్కటే రూ 50 కోట్లు ఉంటుందని దానిలో రూ 1700 కోట్లతో భవనాల నిర్మించారని వివరించారు. రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ విలువ సుమారు రూ 500 కోట్లు ఉంటుందని దానిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు చూస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రజల ఆస్తి అని దానిని కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. పేద ప్రజలకు ప్రమాదం జరిగితే వైద్యం చేయించుకోవాలంటే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే ఎవరూ పట్టించు కోవడంలేదని తెలిపారు ప్రైవేట్ హాస్పిటల్స్ కి వెళ్తే లక్షలాది రూపాయలు అడుగుతున్నారని వివరించారు. పేద ప్రజలు ఎక్కడికి వెళ్లి వైద్య చేయించుకోవాలని ప్రశ్నించారు. చంద్రబాబు 16 నెలల్లో రూ 2 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చాడాన్ని తెలిపారు. 17 మెడికల్ కళాశాలలు నిర్వహించ దానికి కేవలం రూ 5వేల కోట్లు ఖర్చు అవుతుందని, దానిని ప్రభుత్వం ఖర్చు పెట్టలేదా? అని ప్రశ్నించారు. మద్యం సిండికేట్ లో ఈవీఎం ఎమ్మెల్యే కి రూ 1.40 కోట్లు ఇచ్చి, బాటిల్ కు రూ 10 నుంచి రూ 20 రూపాయలు ఎక్కువ ధరలకు అమ్ముకునేలా మద్యం సిండికేట్ లు పథకం రచించారని, టీడీపి నాయకుడు కిలపర్తి శ్రీనివాస్ ఫోన్ లో మాట్లాడిన సంభాషణ బయటపడిందని తెలిపారు. గతంలో టిడిపి నగర అధ్యక్షుడు ఆనంద్ రీజన్సీ లో సమావేశం ఏర్పాటుకు సన్నహాలు చేసినట్లు తెలిపారు. రాజమండ్రి సిటీ,రూరల్ పరిధిలో 39 మద్యం షాపులు ఉన్నాయని వాటి మీద ఎమ్మెల్యేకు నెలకు రూ 60 లక్షలు ఆదాయం వస్తుందని తెలిపారు. మద్యం సిండికేట్ ద్వారా ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిగితే ప్రజలకు భారం పడుతుందని, ఎమ్మెల్యేకు ఆదాయంలో వస్తుంది తెలిపారు. కూటమి ప్రభుత్వం భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల దేవాలయాల వద్ద తొక్కిసలాట జరిగి భక్తులు మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఏకాదశి రోజున కాశీబుగ్గ లో ఒక దేవాలయానికి సుమారు 25 వేల మంది భక్తులు వెళ్లడంతో తొక్కిసులాట చోటుచేసుకుందని ఈ సంఘటనలో 9 మంది మృతి చెందారని తెలిపారు. అలాగే తిరుపతిలో తొక్కిసలడు జరిగి 6 గురు మృతి చెందారని తెలిపారు. ఈ సంఘటనలకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద సెప్టిక్ ట్యాంక్ లీక్ అయ్యి అపరిశుభ్ర వాతావరణం నెలకొందని దీనికి కారుకులైన వర్క్ ఇన్స్పెక్టర్, ఎన్ హెచ్ ఓ లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సనాతన ధర్మాలను పరిరక్షిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం దేవాలయాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నిర్మూలించడం, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతుందని విమర్శించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో 13 వార్డు నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మార్తి లక్ష్మీ, మార్తి నాగేశ్వరరావు పోటీ చేస్తారని వారికి 13 వ వార్డు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ అని కొనియాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నాపుడు అండగా ఉన్నవాడే నిజమైన కార్యకర్త అని, కార్యకర్తలను గుర్తించుకోని వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. రచ్చబండ కార్యక్రమానికి ఆంధ్రుడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. ఆయన మంత్రివర్గంలో 10 సంవత్సరాలు పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేశంలో ఎవరు అమలు చేయాలేని ఆరోగ్యశ్రీ పథకాలు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. పెన్షన్లు ఇల్లు ఇతర సంక్షేమ పథకాలు ఆయన ప్రభుత్వంలో అమలు జరిగిందని అన్నారు. ఆయన ఆశయాలు సాధనకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయనకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తన చిన్నతనంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో కేవలం 10 మెడికల్ కాలేజీలు ఉండేవని తెలిపారు. 50 సంవత్సరాలు కాలంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు తీసుకురాలేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారని అన్నారు. ఆయన హాయంలోనే 7 మెడికల్ కాలేజీ లకు శంకుస్థాపన చేసి నిర్మాణం జరిగిందని అన్నారు. 10 మెడికల్ కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. వైద్యాన్ని వ్యాపారంగా చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. ఒక మెడికల్ కాలేజీ సీటు కోటి రూపాయలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే వైద్య విద్య పేదలకు అందుబాటులో ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కోటి సంతకాలు చేయడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతోపాటు, రోడ్డుపైకి వచ్చి ప్రజలు ఆందోళన తెలియ జేయాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని, ప్రజల ఆస్తిని కాపాడుకోవడానికి యుద్ధం చేయడానికైనా వైసిపి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు గుర్రం గౌతం, సంకిస భవానీప్రియ, రాష్ట్ర వైఎస్ఆర్సిపి యువ నాయకులు అరే చిన్ని, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అరిఫుల్లా ఖాన్, గౌస్ బేగ్, అరిషిబట్ల అనంతలక్ష్మి, కొర్నాని అను యాదవ్, ఒత్తుకుటి, కృష్ణవేణి, అనురాధ, బుద్దాల కుమార్, కాటం రజనీకాంత్, షేక్ భాషా, మజ్జి అప్పారావు, బాలశ్రీధర్, దుర్వాసుల సత్యనారాయణ, మునీశ్వరరావు సేపేని, సోడాదాసి సుందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విజయవాడ ఇంద్ర కీలాద్రిపై ఉన్న అమ్మవారిని మంగళవారం సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ అమ్మవారి కరుణ కటాక్షం నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. ఆయన వెంట నియోజకవర్గ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు ఉన్నారు.

# సమర్ధవంతమైన సేవలకు అందిన సత్కారం

## ఎఎంవో రాంబాబును సత్కరించిన డీఈవో సలీం బాషా



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్కౌట్ అండ్ గైడ్స్ వంటి ట్రైనింగ్‌లు నిర్వహించడంతో పాటుగా, ఆన్‌గోయింగ్ ప్రోగ్రామ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించిన సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబును జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో జిల్లా విద్యాశాఖాధికారి సమక్షంలో జరిగిన ఈ విషయాన్ని ఏఎంఓ రాంబాబు స్థానిక విలేకరులకు తెలిపారు. విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రైనింగ్స్‌ను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నందుకు సత్కారం చేసినట్లు ఆయన తెలిపారు. ఎఫ్ఎల్ఎన్, తర్ల్, ఎస్ఎల్‌డీపీ, ఇండక్షన్,తో పాటు పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు దుశ్శాలువా కప్పి, పూలమాల, జ్ఞాపికతో సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌లో పనులు పరిశీలించిన చైర్ పర్సన్ రాణి...



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం 24వ వార్డు సంగంపుంత రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో చేపట్టిన పనులను మంగళవారం రాత్రి చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పరిశీలించారు.అక్కడ చేపట్టిన లెగసి వేస్ట్ మేనేజ్మెంట్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా వేస్ట్ మేనేమెంట్ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట డి.ఈ కె. శ్రీనివాసు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం.సత్తిరాజు ఉన్నారు.

# విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

## మండల విద్య శాఖ అధికారి చింతా సోమిరెడ్డి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మండపేట మండల విద్య శాఖ అధికారి చింతా సోమిరెడ్డి పేర్కొన్నారు. మండపేట వేగుళ్ళ సూర్యరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండపేట శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక మండపేట పట్టణ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మీర్ అలీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి చింత సోమిరెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా వేత్త వల్లూరి సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ సైన్స్ సమాజ అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. సైన్స్ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని నమ్మ కూడదని పేర్కొన్నారు. శాస్త్రీయ విషయాలకే ప్రాముఖ్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ పోటీలలో మండపేట మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ద్వారపూడి శ్రీ చేకూరి కాశీ విశ్వనాథరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాల విభాగంలో ద్వారపూడి బాల మణికంఠ స్కూల్ ప్రథమ స్థానాలను పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. మండపేట పట్టణ స్థాయి నుండి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో శ్రీ జవహర్లాల్ మున్సిపల్ హై స్కూల్, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో శ్రీ అన్నపూర్ణ హై స్కూల్ లు ప్రథమ స్థానాలను పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమం లో జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి,రామచంద్ర రెడ్డి, కే.ఏసుబాబు, మండపేట మండల అధ్యక్ష కార్యదర్శులు జి,సుధాకర్, డి,మణికంఠ కుమార్ జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గండి స్వామి ప్రసాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జ్ ఇనుమర్తి ప్రసాద్, యూటిఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.రాజేంద్ర మండపేట మండల ప్రధాన కార్యదర్శి తాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ మహేష్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్జీల పరిష్కారంలో అల సత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల నుంచి సుమారుగా 270 అర్జీలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆ ర్ఎస్ అర్జీదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని చెప్పారు. సరైన విధంగా ఎండార్స్మెంట్లు ఇవ్వాలని, అర్జీదారులతో అధికారుల ప్రవర్తన విషయంలో మంచి ఫీడ్బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశి క్షణతో పనిచేయాలని సూచించారు. ప్రజాస మస్యల పరిష్కార వేదికకు హాజరైన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభించేలా కృషి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. మార్గదర్శకాలు పాటించడంలో ప్రవర్తన వరంగా కొందరు అధికారులలో లోపాలు కనిపిస్తున్నాయని వీటిని నరిదిద్దుకోవా లన్నారు. వీటిని నరిదిద్దు కోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల ఆడిటింగ్ నక్రమంగా పూర్తిచేయాలని, నమస్య పరిష్కార అధికారి గ్రీవెన్స్ రెడ్రెస్సల్ అథారిటీ స్వయంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి ఫీడ్ బ్యాక్ ను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారికి సూచనలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభు త్వ అత్యంత ప్రతిష్టాత్మక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్‌యస్‌లో అందిన ప్రతి అర్జీకి పారదర్శకత, నాణ్యతతో పరిష్కారం చూపాలన్నారు ప్రజా సమస్యలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా అధ్య యనం చేసి తమ సిబ్బంది ద్వారా నిర్ణీత గడువు లోపుగానే పరిష్కారం చూపాలన్నారు. ఒక్కోసారి ఫిర్యాదు పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదా రులతో స్వయంగా అధి కారులు మాట్లాడాలనిన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెనువెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా నమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికా రులను జిల్లా కలెక్టరు అదేశించారు. ఈ కార్య క్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,డిఆర్ఓ కె మాధవి డిపిఓ శాంత లక్ష్మి, డి ఎల్ డి ఓ లు రాజేశ్వరరావు వేణుగోపాల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే ప్రభాకర్, డీఈవో షేక్ సలీం భాష జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మడ అడవులు, చెత్తడి నేలను కాపాడి

# పర్యావరణాన్ని, ప్రజల ప్రాణాలను రక్షించండి...

## మడ అడవులను ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : సిపిఎం పార్టీ డిమాండ్





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** "ప్రకృతిని మానవుడు రక్షిస్తే, ఆప్రకృతే మానవ ప్రాణాలను కాపాడుతుంది " కానీ వ్యాపారమూ, లాభాలే పరమావిధిగా భావించే నేటి అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాకినాడ రూరల్ తూరంగి పంచాయితీ పరిధిలో ప్రకృతి ప్రసాదించిన మడ అడవులను, చెత్తడి నేలను యదేచ్ఛగా ఆక్రమణలు సాగిస్తున్నారు. వీటిపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న రియల్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. తాళ్లరేవు వరకూ ఉన్న తీర ప్రాంత భూములు నేడు రియల్ ఎస్టేట్లుగా, చేపల చెరువులుగా, రొయ్యల చెరువులుగా మారిపోయాయి వీటిపై సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపియం పార్టీ రూరల్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ కాకినాడ రూరల్ మండల కమిటీ సమావేశం ఈరోజు తొట్టిపూడి రాజా అధ్యక్షతన సుందరయ్య భవన్లో జరిగింది.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మోంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించిన జిల్లా అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సిపిఎం పార్టీ అభినందనలు తెలియజేస్తున్నది. అదే సందర్భంగా ప్రకృతి మనకి వరంగా ఇచ్చిన మడ అడవులను, చెత్తడి నేలలను తూరంగి అల్లూరు సీతారామరాజు కాలనీ సర్వేనెంబర్ 218 లో చట్ట విరుద్ధంగా ఆక్రమణలు చేస్తున్న రియల్టర్లను నివారించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆయన అన్నారు. 14 ఎకరాల్లో విస్తరించిన మడ అడవులు, చిత్తడి నేలలో 2 ఎకరాలను ఆక్రమించి పెంకె జైన్ కుమార్, సోంబాబులు అక్రమ కట్టడాలు కడుతున్నా ఇవి సి ఆర్ జెడ్ ( కోస్టల్ రెగ్యులేటరీ జోన్) పరిధిలోకి వస్తున్నా రెవెన్యూ, పంచాయతీ, కుడా ప్రభుత్వ సంస్థలు ఏం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. దీనిపై వెంటనే తగ్గిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. తుఫాను ముంపులను, సముద్ర కోతలను నివారించడంలో మడ అడవులు దానికి సపోర్టుగా చెత్తడి నేలలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కాకినాడకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న హెూప్ ఐలాండ్ భారీ తుఫానుల నుండి కాకినాడను కాపాడుతున్నది. ఈ మడ అడవులు లేని ఉప్పాడ ప్రాంతం సముద్రం అలలకు కోతకు గురవుతున్న అనుభవం మనం చూస్తున్నాం. ఈ మడ అడవులను, చిత్తడి నేలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, పర్యావరణ వేత్తలపై ఎంతగానో ఉందన్నారు. గతంలో వైసిపి హయాంలో దుమ్ములపేటలో మడ అడవులను ధ్వంసం చేసిన అంశంపై పర్యావరణవేత్తలు కేంద్ర స్థాయిలో పోరాటం చేయడం దానిని దుమ్ములపేట మడ అడవులను రక్షించుకోవడం ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. నేటి టిడిపి కూటమి పార్టీల హయాంలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసం ఆపాలన్నారు. ఈరెండు పార్టీలు అక్రమ సంపాదన కోసం ప్రకృతిని సహితం ఫణంగా పెడుతున్నాయి. ఈమడ అడవులను చెత్తడి నేలలను మనం రక్షించుకో లేకపోతే దుమ్ముల పేట నుండి ఏటిమొగ, ముత్తానగర్, మహాలక్ష్మి నగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, డ్రైవర్స్ కాలనీ, పగడాల పేట, ఉప్పలంక, తాళరేవు వరకూ పది ప్రాంతాలు భారీ ప్రమాదం పొంచి ఉన్నదని నాగేశ్వరరావు తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణం కదిలి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకొనే చర్యలను ప్రజలకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సిపియం పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్ హాజరయ్యారు. మండల కమిటీ సభ్యులు చింతపల్లి అజయ్ కుమార్, పెద్దంశెట్టి రామకృష్ణ, సిహెచ్ విజయ్ కుమార్, సూర్యం లు పాల్గొన్నారు.

# పని గంటల పెంపును వ్యతిరేకించండి

## ఆమోదం తెలిపిన ప్రజాప్రతినిధులను నిలదీయండి – పెరుగుతున్న అధిక ధరలకు అనుగుణంగా జీతాలు పెంచండి..



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ & సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ముఖ్యుల సమావేశం కాకినాడ జిజిహెచ్‌లో మంగళవారం ఉదయం అధ్యక్షులు కే.వీ.రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పని గంటల పెంపును ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేయుటకు జీవోలు సిద్ధం చేసిందని,పని గంటల పెంపును తక్షణమే వ్యతిరేకించాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, అందులో భాగంగానే ఈ పని గంటల పెంపుదల అని, కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయాలని, కార్మికుల శ్రమను బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ వ్యక్తులకు ధారాధత్వం చేసే విధంగా వారి శ్రమను దోచి పెట్టే విధంగా పని గంటల విధానాన్ని పెంచుతుందని, సై అంటే తందానతానా అనే చందంగా కేంద్ర ప్రభుత్వం పని గంటల పెంపును ప్రవేశపడితే ఏ రాష్ట్రంలోని అమలు కాలేకున్న ఆంధ్ర రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల మొండి వైఖరి ప్రదర్శిస్తూ పని గంటల పెంపును అమలు చేయడానికి జీవోలు సిద్ధం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని దినాలు అమలుకు అనేక పోరాటాల ప్రాణ త్యాగాల ఫలితం అని, భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా 8 గంటల పని దినాన్ని రద్దు చేసేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, పని గంటల పెంపు విధానాన్ని సంఘటిత, అసంఘటిత, పరిశ్రమల్లో, షాపులలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగులు అందరూ పని గంటల పెంపును వ్యతిరేకించాలని, పనిగంటల పెంపును ఆమోదం తెలిపిన ప్రజా ప్రతినిధులను నిలదీయండి అని ఆయన అన్నారు. 8 గంటలు పనిచేస్తున్నఇప్పటికే మోకాలు చెప్పులు అరిగిపోవడం, వెన్నుపూస అరిగిపోవడం, దీర్ఘకాలిక వ్యాధులకు గురి కావడం వంటివి జరుగుతుందని పని గంటల పెంప పూర్తిగా అమలు జరిగితే అనారోగ్యానికి గురై మంచాన్ని పట్టే పరిస్థితికి ప్రభుత్వం తీసుకొస్తుందని ఆయన అన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు పెరుగుతున్న అధిక ధరలకు అనుగుణంగా వారి జీతాలు పెంచాలని, ప్రభుత్వానికి కాంట్రాక్టర్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారంగా వారి జీతాలు అమలు చేయాలని సి.ఎల్, కుట్టుకూలీ, పండగ సెలవులు, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈ సమస్యల పరిష్కారానికై నవంబర్ 10వ తేదీ నుండి 15వ తేదీ వరకు గఫదపాల ఆందోళనగా ఆసుపత్రి వద్ద నిరసనలు తెలియ చేస్తామని 17 తేదీసోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని ఆయన అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరెంట్ ఇంచార్జ్ గారికి, కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ వారికి నోటీసులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ అనిల్ కుమార్, రాజేంద్ర రావు, అప్పారావు, డేగల మధు, ఆవాల లోకుమారి, కాటూరి రాజు, వెంకటేష్, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షులుగా

# లోసుల రాజుబాబు



**రాజవొమ్మంగి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజవొమ్మంగి బీజేపీ మండల అధ్యక్షులుగా లోసుల రాజుబాబునీ నియమించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈ స్వప్న కుమారి వెల్లడించారు. మంగళవారం రాజవొమ్మంగి మండలంలో జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించు కోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిర్రాబు పంచాయతీ గొడ్లగొంది గ్రామానికి చెందిన లోసుల రాజుబాబుని మండల అధ్యక్షులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి సూచనలు మేరకు నియమించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. రాజవొమ్మంగి మండలం లో బీజేపీ పార్టీ బలోపేతానికి నూతన మండల అధ్యక్షులు స్థానిక సీనియర్ నాయకులను కలుపుకొని పని చేస్తారని స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుంచి మండలం వరకు బీజేపీ పార్టీ బలోపేతం, ప్రభుత్వం పథకాలు లబ్ధిదారులుకు చేర్చడంలో వీరు ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ మండల అధ్యక్షులు తాము సూరిబాబు, వీరే కొండబాబు, బ్రిజిన రామారావు,వీరే రాజబాబు, గుర్రం నాగేంద్ర, రుద్రపాటి గున్నయ్య, తామరపు సత్తిబాబు, కాకురి చిన్న బాబు మాజీ సర్పంచ్ , కాకురి నాగమణి, బోడారపు ఆనందరావు, టోకూరి కృష్ణ, నోవాబద్రి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీకి సీసీ కెమెరాల అందజేసిన కోరమాండల్ సంస్థ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వీలుగా కోరమాండల్ ఎరువుల కర్మాగారం ప్రతినిధులు పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్‌కు సీసీ కెమెరాలను,హెల్మెట్లు అందజేశారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా పోలీస్ వ్యవస్థలో భద్రతా పర్యవేక్షణను బలోపేతం చేయడం,ఆధునిక సాంకేతికత ఆధారంగా స్ట్రాటజిక్ రెస్పాన్స్ సెంటర్ (కమాండ్ కంట్రోల్) పనితీరును మరింత అభివృద్ధి చేయడం,పబ్లిక్ సేఫ్టీ, నిఘా, ట్రాఫిక్ మానిటరింగ్, నేరాల నివారణలో సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తరించడంలో భాగంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ. 10 లక్షల విలువైన 96 సీసీ కెమెరాలు జిల్లా పోలీస్ శాఖకు అందజేయడం సంతోషదాయకమన్నారు. అదనంగా 94 హెల్మెట్లను కూడా పోలీస్ సిబ్బందికి అందజేశారు.ఈ సాంకేతిక పరికరాలు కాకినాడ జిల్లా పరిధిలో ముఖ్యమైన ప్రాంతాలలో ఇన్‌స్టాల్ చేయబడతాయని తెలిపారు. కార్యక్రమంలో మనీష్ దేవరాజ్ పాటిల్, ఐపీఎస్ – కాకినాడ ఎస్డిపిఓ కె.వి. సత్యనారాయణ –డిఎస్పి, స్పెషల్ బ్రాంచ్,బి. పెద్దిరాజు – ఇన్స్పెక్టర్, సర్పవరం పోలీస్ స్టేషన్ డి.దుర్గా శేఖర్ రెడ్డి – ఇన్స్పెక్టర్, ఐటీ కోర్, కె.సన్యాసిరావ్ – ఇన్స్పెక్టర్, పీసీఆర్ (ఎస్ ఆర్ సి), కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నుండి కె.జగన్నాథన్ – సీనియర్ ఏవిపి & యూనిట్ హెడ్, పురుషోత్తం పద్మనాభం – సీనియర్ జనరల్ మేనేజర్ (హెచ్.ఆర్.), జీవీ సాయి కృష్ణ – చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్,కె. వంశీకృష్ణ –అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (హెచ్.ఆర్) ఎస్. లక్ష్మీనారాయణ – డిప్యూటీ సీనియర్ మేనేజర్, వి.శ్రీను – డిప్యూటీ సీనియర్ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

# వైజాగ్‌లో కొత్త ట్రెండ్ స్టూడియో ఫ్లాట్స్‌కు టెక్ బూస్ట్!

విశాఖపట్నం ఇప్పుడు కేవలం పోర్ట్ సిటీ కాదు అది టెక్ హబ్‌గా మారుతున్న సిటీ. టెక్నాలజీ, ఇండస్ట్రీ, లగ్జరీ నివాసాలకు కేంద్రంగా మారుతోంది. ఇటీవల ఈ నగరంలో వేగంగా పెరుగుతున్న ఒక కొత్త హౌసింగ్ కాన్సెప్ట్ స్టూడియో ఫ్లాట్స్ లేదా సర్వీస్ అపార్ట్‌మెంట్లు. కేవలం 400 నుంచి 600 స్క్వేర్ ఫీట్ల మధ్య ఉండే ఈ చిన్న స్మార్ట్ నివాసాలు ఇప్పుడు టెక్ కంపెనీలకు, తాత్కాలికంగా నగరంలో ఉండే ఉద్యోగులకు అత్యంత ప్రాధాన్యత పొందుతున్నాయి. టెక్ వేవ్‌తో పెరుగుతున్న డిమాండ్ వైజాగ్ ఐటీ, టెక్నాలజీ రంగాల్లో వేగంగా ఎదుగు తోంది. అమెజాన్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, డెలాయిట్ వంటి అనేక కంపెనీలు ఇక్కడ తమ యూనిట్లను విస్తరించాయి. ప్రతి వారం కొత్త ప్రాజెక్టు మొదలవుతుం డడంతో నగరానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్లు, గెస్ట్ ఇంజినీర్లు వస్తున్నారు. వీరికి తాత్కాలిక నివాసం అవసరం అవు తోంది. ఈ డిమాండ్‌ను గమనించిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు స్టూడియో ఫ్లాట్స్ వైపు దృష్టి సారించింది. క్రిడాయ్ సర్వే ప్రకారం.. విశాఖలో ప్రస్తుతం ఉన్న సుమారు 30 సర్వీస్ అపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. వీటిలో వారాంతపు అద్దెలు కూడా నెలకు హోటల్ ఖర్చుతో సమానంగా ఉండేంత డిమాండ్ పెరిగింది. ఈ యూనిట్లు కేవలం నివాసాలు కాదు టెక్ వర్క్ కల్చర్‌కు సరిపోయే స్మార్ట్ లివింగ్ స్పేస్‌లు. ఆకర్షణ వెనుక ఉన్న సౌలభ్యం స్టూడియో ఫ్లాట్స్ స్మార్ట్ సిటీ లైఫ్‌కి సరిపోయేలా రూపుదిద్దుకుంటున్నాయి. చిన్న స్థలంలోనే లివింగ్ ఏరియా, మినీ కిచెన్, సింగిల్ బెడ్‌రూమ్ కానీ సౌకర్యాలు చూస్తే వేరే లెవల్. హై-స్పీడ్ ఇంటర్నెట్, స్మార్ట్ లైటింగ్, మోడర్న్ ఫర్నీచర్, 24 గంటల సెక్యూరిటీ, లాండ్రీ, ఫుడ్ సర్వీస్ వంటి అన్ని ఫీచర్లు అందుబాటులో ఉంటున్నాయి. ఈ సౌకర్యాలే టెక్ సంస్థలను ఆకర్షిస్తున్నాయి. వారం లేదంటే 10 రోజుల ప్రాజెక్టుల కోసం వచ్చిన సిబ్బందిని హోటళ్లలో ఉంచడం కంటే స్టూడియో ఫ్లాట్స్‌లో ఉంచడం ఖర్చుతో పాటు సౌలభ్యపరంగా కూడా మంచిదని కంపెనీలు చెబుతున్నాయి. ఒక ఐటీ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ 'హోటల్ ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కానీ స్టూడియో ఫ్లాట్స్ మాకు కంఫర్ట్, ప్రైవసీ కూడా ఉంటుంది. వర్క్ ఫ్రం హోం తరహా వాతావరణంలో ఉద్యోగులు రిలాక్స్‌గా ఉంటున్నారు.' అని చెప్పాడు.



హౌసింగ్ రంగానికి కొత్త దిశ రియల్ ఎస్టేట్ నిపుణుల అంచ నా ప్రకారం.. ఈ ట్రెండ్ వల్ల వైజాగ్ హౌసింగ్ మార్కెట్‌లో కొత్త శకం మొదలైంది. పెద్ద అపార్ట్‌మెం ట్లతో పోలిస్తే స్టూడి యో యూనిట్లు తక్కు వ ఖర్చుతో నిర్మించ వచ్చు, తక్కువ సమ యంలో అమ్ము డవుతాయి. అద్దె రాబడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది డెవలపర్లకు లాభదాయకం, వినియోగదారులకు సౌకర్యవంతం. ఇక భవిష్యత్తులో భీమిలి, మధురవాడ, తాడేపల్లిగూడెం, సీతమ్మధార వంటి ప్రాంతాల్లో కూడా ఇలాంటి మైక్రో ప్రాజెక్టులు మొదలయ్యే అవకాశం ఎంతో దూరంలో లేదు. వైజాగ్‌లో ఐటీ సిటీగా రూపుదిద్దుకుంటున్న భవిష్యత్తుకు ఇది మరింత బలాన్ని ఇస్తుంది. వైజాగ్ కొత్త జీవనశైలికి ప్రతీక ఇప్పటికే వైజాగ్ ఇండస్ట్రీ, విద్య, పర్యాటక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇప్పుడు అదే నగరం లైఫ్ స్టయిల్ మార్పు కేంద్రంగా మారుతోంది. స్టూడియో ఫ్లాట్స్ కేవలం నివాసాలు కాదు.. అవి ఆధునిక జీవనశైలికి ప్రతిబింభాలు. టెక్ కంపెనీలు వారానికోసారి అద్దె చెల్లిస్తూ ఈ సౌకర్యాలను బుక్ చేసుకుంటున్నాయి. వైజాగ్ ఇప్పుడు తన భవిష్యత్తు రూపాన్ని స్వయంగా మార్చుకుంటోంది.

# జంక్షన్‌లో బిక్షగాళ్ళు... సవాల్ చేస్తున్నారు !



వృత్తులు అనేక రకాలు. పొట్ట కూటి కోసం కోటి విద్యలు అని అంటారు. ఆఖరులు దొంగతనాన్ని కూడా ఒక వృత్తిగా చెబుతారు. మరి అందులో భిక్షమెత్తడం వృత్తిగా ఉందో కళగా ఉందో తెలియదు. నిజానికి బిక్షగాళ్ళను చూస్తే అంతా జాలి పడతారు. అయ్యో అడుక్కుంటున్నారే వారికి పాపం ఏమీ లేదే అని మనసు కరిగిపోయి చిల్లర వేస్తారు. వారి ఆకలి బాధ ఎంతో కొంత తీర్చిన వారం అవుతాం కదా అని కూడా మంచి మనసు చూపిస్తారు. అయితే బిక్షగాళ్ళు అందరూ అలాగే ఉన్నారా అంటే కాదు అని చెప్పాల్సిందే. పొట్ట కూటి కోసం అడుక్కునే వారు కొందరు అయితే దీనిని ఒక వృత్తిగా మార్చుకుని హాయిగా కులాసాగా బతికే వారు చాలా మంది ఉన్నారు. గట్టిగా చెప్పాలంటే బిక్షగాళ్ళను నడిపించే దందాలు ఉన్నాయి అంటారు.

**బిక్షగాళ్ళు ఉండరాదు :** ఏపీ ప్రభుత్వం తాజాగా ఒక నిర్ణయం తీసుకుంది. బిక్షగాళ్ళు లేకుండా చూడాలని ఒక ఉత్తర్వుని తీసుకుని వచ్చింది మహా నగరాలలో బిక్షగాళ్ళు అధికంగా ఉంటున్నారు. అంతే కాదు ప్రతీ జంక్షన్లో వారి బెడద ఎక్కువగా ఉంటోంది. ఆగిన ప్రతీ వాహనం దగ్గరకు వచ్చి మరీ విసిగించి చిల్లర వేయించుకుంటున్నారు. విశాఖ లాంటి నగరాలలో అయితే బిక్షగాళ్ళ సంఖ్య అధికంగా ఉంది. పెద్ద సిటీలు కీలక పట్టణాల్లో బిక్షగాళ్ళు అంతకంతకు పెరిగిపోతున్నారు. వీరి విషయంలో ఏమి చేయాలన్న దాని మీద కూటమి ప్రభుత్వం కసరత్తు చేసి మరీ ఈ ఉత్తర్వు జారీ చేసింది.

**కనిపిస్తే అలా :** బిక్షగాళ్ళు కనిపిస్తే వారి బంధువుల దగ్గరకు వివరాలు కనుక్కొని పంపించడం, అలా కుదరకపోతే వారిని అనాధ ఆశ్రమాలలో దింపడం చేసేలా ప్రభుత్వం చర్యలకు దిగబోతోంది, ఇప్పటికే విశాఖ లాంటి చోట్ల బిక్షగాళ్ళు కనిపించకుండా చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. విశాఖ ఇపుడు అంతర్జాతీయ నగరంగా ఉంది. అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సుకు విశాఖ వేదికగా మారింది. దీంతో ఈ నగరానికి ఎంతో మంది ప్రముఖులు వీవీఅపీలు వస్తున్నారు. వారి ముందు విశాఖ పరువుతో పాటు రాష్ట్రం ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా బిక్షగాళ్ళు కనిపిస్తే అది ఇబ్బంది అవుతునందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వారిని ఆ వృత్తి నుంచి దూరం చేయాలని అందరితో పాటుగా వారి పేదరికం తీర్చేందుకు పథకాలు అందచేసి జన జీవన స్రవంతిలోకి తీసుకుని రావాలని అనుకుంటోంది.

**టఫ్ టాస్క్ గానే :** ప్రభుత్వం అయితే పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. పీ 4 పథకం అందులో భాగమే. పేదలను ఒక స్థాయికి తీసుకుని వచ్చేందుకు డబ్బున్న వారిని దత్తత తీసుకోమని ప్రభుత్వం ప్రతిపాదనలు పెట్టింది. దానికి మంచి స్పందన కూడా లభించింది. అయితే ఇపుడు బిచ్చగాళ్ళ విషయంలో కూడా కఠినంగా ఉంటూ వారిని ఒక దారికి తేవాలని ఏపీలో బిక్షగాళ్ళు లేని పరిస్థితిని చూడాలని అనుకుంటోంది. కానీ ఆచరణలో ఇది టఫ్ జాబ్ అని అంటున్నారు. ఎందుకంటే బంగారం చేతికి ఇచ్చినా దానిని తన మూటలో కట్టుకుని తిరిగి బిచ్చమెత్తుకోవడానికే బిక్షగాడు చూస్తారు అని అంటున్నారు

**వ్యసనంగా అలవాటుగా :** అది వారికి ఒక వ్యసనంగా అలవాటుగా మారింది అని అంటున్నారు. ఇక బిక్షగాళ్ళను వెనక నుంచి నడిపే దందాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. వారే ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అన్నది కూడా ఉంది. ఇలా లోతుగా ఎంతో మూలాల్లోకి అల్లుకునిపోయిన ఈ బిక్షాన్ని నిర్మూలించడం కష్టసాధ్యమే అని అంటున్నారు. వీరిని దూరంగా ఎక్కడికి పంపించిన తిరిగి తమ చోటు వెతుక్కుని అక్కడికే వచ్చేస్తారు అని అంటున్నారు. ఏది ఏమైనా బిక్షగాళ్ళు లేని సమాజం అందరి కోరిక అది నెరవేరాలని కోరుకోవాల్సిందే.

# సదుపాయాలపై ప్రత్యేక దృష్టి..

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఎమ్మెల్యే గోరంట్ల...



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల వారి కార్యాలయం నందు ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్ మరియు రూరల్ మండలం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల పంచాయితీలు వారిగా ప్రతి పంచాయతీలో వసూలు చేయవలసిన బకాయిల వివరాలు, ఖర్చులు, ఇతర అంశాలపై సమీక్ష జరిపారు. అధికారులందరూ గ్రామాల్లో విధిగా తనిఖీ చేస్తూ ఉండాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల జీతాలు సక్రమంగా సమయానికి అందించాలని తెలిపారు. రూరల్ మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు వేసిన సిసి రోడ్లు, డ్రైనేజీలు వాటికి చెల్లించిన బిల్లులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో అత్యవసరంగా పూర్తి చేయవలసిన పనులకు అంచనాలు సిద్ధం చేయాలని, ప్రజల అభీష్టం మేరకు రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

# ఎస్‌కెవిటి స్కూల్‌లో చెకుముకి సైన్స్ సంబరాలు

## జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అర్బన్ మరియు రూరల్ మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఎస్‌కేవిటి ఉన్నత పాఠశాల రాజమహేంద్రవరంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.భీమయ్య, ఎన్.రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎంఈఓ బి.దిలీప్ కుమార్ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించు కోవలసిన ఆవశ్యకతను వివరించారు పాఠశాల స్థాయి విజేతలను అభినందించారు. మండల స్థాయి విజేతలకు దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం బహుమతులు ప్రధానం చేశారు. ప్రైవేటు పాఠశాల విభాగంలో మొదటి బహుమతి శ్రీ గౌతమి స్కూల్, గాంధీపురం ద్వితీయ బహుమతి శ్రీ గౌతమి స్కూల్ శ్రీరామ్ నగర్, తృతీయ బహుమతి ప్రతిభ నెక్స్ట్ జెన్, ప్రత్యేక బహుమతిని ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సాధించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాల విభాగంలో మొదటి బహుమతి నెహ్రూ నగర్ మున్సిపల్ హై స్కూల్, ద్వితీయ బహుమతి షాడే ఇంగ్లీష్ మీడియం స్కూల్, తృతీయ బహుమతి శ్రీ నాగరాజు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, ప్రత్యేక బహుమతి కంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ గెలుపొందడం జరిగింది.కార్యక్రమంలో కోశాధికారి జీ.తాతారావు, కార్యదర్శులు చెక్క తాతారావు, యూత్ కన్వీనర్ సిహెచ్ నిశ్చల్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## నగర జనసేన పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత మహిళా టీమ్ అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రపంచకప్ సాధించిన నేపథ్యంలో రాజమండ్రి సిటీ జనసేన పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజమండ్రి జనసేన పార్టీ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, సతీమణి అనురాధదేవి పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం బోర్డ్ డైరెక్టర్ గంట స్వరూప దేవి,హౌసింగ్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియాసౌజన్య,జనసేన వీర మహిళలందరూ మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తీసిపోరని ఈ ప్రపంచకప్ గెలిచి టీమ్ ఇండియా నిరూపించిందని ఎలుగెత్తిన నినదించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి నగర వీర మహిళలు ఎండోమెంట్ డైరెక్టర్లు కళ్యాణి, శాలిని, గౌతమి, నగర జనసేన వీర మహిళలు భారతి, అలివేలు మంగతయారు, ప్రియ పోలిశెట్టి, రాజేశ్వరి, కుమారి, నాగశ్రీ, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# లోకేశ్ ప్రజాదర్బార్.. ఆ జనాన్ని చూస్తే మతిపోవడం ఖాయం!

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కు వేల మంది ప్రజలు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ ఆఫీసులో ప్రజాదర్బార్ ఉంటుందని ముందుగా చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజానీకం వేలాదిగా తరలివచ్చారు. యువనేతను కలిసి తమ సమస్యలను తెలియజేయాలని ఎదురుచూస్తున్నారు. మంత్రి లోకేశ్ సైతం ప్రతి ఒక్కరినీ కలుస్తూ చాలా ఓపికగా, వారి సమస్యలను వింటున్నారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకుంటున్నారు. మంత్రిని కలిసిన వారు ఆయన స్పందించిన తీరు చూసి హ్యాపీగా తిరిగి వస్తున్నారు. దీంతో లైనులో నిల్చొన్నవారు తమ వంతు కోసం ఎదురుచూస్తూ నాలుగైదు గంటలుగా నిరీక్షిస్తున్నారు. ఎలాంటి సమస్య అయినా, మంత్రి లోకేశ్ తో చెప్పుకుంటే పరిష్కారమవుతుందనే భరోసాతో రాష్ట్రం నలుమూలల నుంచి కార్యకర్తలు, ప్రజలు టీడీపీ కార్యాలయానికి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్ నిర్వహించడం ఒక అలవాటుగా చేసుకున్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మరునాడు నుంచి ఉండవవల్లిలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం వద్ద ప్రతిరోజూ ఈ ప్రజాదర్బార్ కొనసాగేది. దాదాపు ఆరు నెలలపాటు నిరాటంకంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. లోకేశ్ ను కలిస్తే తమ సమస్య పరిష్కారమవుతుందనే ప్రచారం ఎక్కువగా జరగడంతో రోజురోజుకు ప్రజాదర్బార్ కు వచ్చే జనం తాకిడి పెరిగింది. దీంతో లోకేశ్ తన నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా ఒక రోజును రిజర్వు చేసుకోవాల్సివచ్చింది. ఇక ఇటీవల పని ఒత్తిడి పెరిగిపోవడంతో లోకేశ్ ప్రజాదర్బార్ నిర్వహించలేకపోతున్నారు. ఈ విషయం తెలియక ఆయనను కలిసేందుకు రోజూ జనం వస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బిజీ షెడ్యూల్‌లోనూ మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహణకు యువనేత సిద్ధమయ్యారు. చాలా కాలం తర్వాత ప్రజలను కలుస్తుండటంతో పూర్తిగా ఒక రోజు పూర్తిగా భక్తుల కోసం కేటాయించారు. ఈ విషయం తెలిసి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం భోజన సమయంలో కూడా ఎవరూ క్యూ నుంచి బయటకు రావడం లేదు. ఈ రోజు ఎలాగైనా సరే యువనేతను కలిసి వెళతామని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి జనం తాకిడి చూస్తే, రాత్రి బాగా పొద్దు పోయే వరకు ప్రజాదర్బార్ కొనసాగేలా కనిపిస్తోంది. యువనేత సైతం ఎంత సమయమైనా అందరినీ కలిసి, వారి సమస్యలు తెలుసుకోవాలనే నిర్ణయంతో ఓపికగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ రాష్ట్రకార్యాలయం నుంచి దాదాపు కిలోమీటరు మేర ప్రజలు బారులు తీరారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన వినతులతో క్యూలైనులో జనం నిల్చొవడం చూసి, మరికొందరు జత కలుస్తున్నారు. గుంటూరు-విజయవాడ రహదారిలో ఈ రద్దీతో లోకేశ్ ఉన్న తెలియని వారు కూడా అప్పటికప్పుడు తమ సమస్యను తెలియజేయాడానికి లైనులో నిల్చొవడం కనిపించింది. ఇక క్యూలైనులో ఉన్న వారికి మంచినీరు, బిస్కెట్లు, మజ్జిక ప్యాకెట్లను టీడీపీ కార్యకర్తలు సరఫరా చేస్తున్నారు.



# భారతీయులే టార్గెట్

న్యూఢిల్లీ

కెనడాలో ప్రభుత్వం మారినా, ప్రధాని మారినా భారత వ్యతిరేక విధానాల్లో ఏ మార్పూ రాలేదు. భారతీయుల వీసాలను తిరస్కరించటమే లక్ష్యంగా ఆ దేశం వలస, ఆశ్రయ చట్టానికి సవరణలు ప్రతిపాదించటమే అందుకు ఉదాహ రణగా నిలుస్తోంది. కెనడా ప్రభుత్వం ఇటీవల ఆ దేశ ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేలా చట్ట సవరణకు అనుమతి ఇచ్చినట్టు సీబీసీ న్యూస్ సంస్థ వెల్లడించింది. ఇమిగ్రేషన్, రిఫ్యూజీ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ), కెనడా బోర్డర్ సర్వీస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) నుంచి సేకరించిన పత్రాలను విశ్లేషించి సీబీసీ న్యూస్ ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం తాత్కాలిక నివాస వీసాల (టీఆర్‌వీ)ను గంపగుత్తగా తిరస్కరించేందుకు ఇమిగ్రేషన్ విభాగానికి అధికారాలు దఖలుపడేలా చట్టసవరణ ప్రతిపాదించారు. ఇందులో ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ పౌరులనే టార్గెట్ చేస్తూ ఈ మార్పులు ప్రతిపాదించారని సీబీసీ కథనంలో పేర్కొంది. ఎవరిదైనా వీసా తిరస్కరించాలంటే దానిపై ప్రత్యేకంగా విచారణ జరిపి, దుర్వినియోగం అయ్యిందని తెలితే చర్యలు తీసుకుంటారు. కానీ, ఇకపై ఒక్కో కేసును కాకుండా మూకుమ్మడిగా వీసాలను




తిరస్కరించేందుకు ఈ మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు. కెనడా ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో భారతీయ విద్యార్థుల నుంచి వచ్చిన వీసా దరఖాస్తుల్లో 74 శాతం దరఖాస్తులను తిరస్కరించిందని రిపోర్టులు చెబుతున్నాయి. అదే నెలలో చైనా నుంచి వచ్చిన విద్యార్థి వీసాల్లో 24 శాతం మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. 2023 ఆగస్టులో భారతీయ విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 32 శాతం మాత్రమే.

పెరుగుతున్న ఆశ్రయ దరఖాస్తులు

కొన్నేళ్లుగా భారత్ నుంచి కెనడాల్లో ఆశ్రయం కోసం దరఖాస్తులు పెరుగుతున్నాయి. 2024లో అంతర్జాతీయ విద్యార్థుల నుంచి కెనడాకు 20,245 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో భారత్, నైజీరియా నుంచే అధికంగా ఉన్నాయి. 2023 మేలో భారత్ నుంచి ఆశ్రయం కోరుతూ వచ్చిన విద్యార్థుల దరఖాస్తులు 500 వరకు ఉండగా, 2024 జూలై నాటికి నెలకు 2,000లకు పెరిగాయి. వీటికి అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ఇమిగ్రేషన్ చట్టంలో సవరణలు ప్రతిపాదించినట్టు సీబీసీ పేర్కొంది. కెనడా నిర్ణయంపై వలసల హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. కెనడా ప్రభుత్వం తన ప్రయత్నాలను మానుకోవాలని దాదాపు 300 సంఘాలు విజ్ఞప్తి చేశాయి. చట్ట సవరణ అమలైతే ప్రస్తుతం అమెరికా నుంచి విదేశీయులను గెంటివేస్తున్నట్టుగానే కెనడా నుంచి కూడా విదేశీయులను మూకుమ్మడిగా గెంటేస్తారని ఇమిగ్రేషన్ న్యాయవాదులు ఆందోళన వ్యక్తంచేశారు.

# రేపే బిహార్ తొలి పరీక్ష

న్యూఢిల్లీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ప్రచార ఘట్టానికి తెరపడింది. తొలి దశలో భాగంగా గురువారం 121 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. తొలి దశ ఎన్నికలు జరిగే స్థానాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. చివరిరోజు ఇటు ఎన్డీయే, అటు మహాగఠ్‌బంధన్ అగ్రనేతలు సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ ముఖ్య నేతలు ఎన్డీయే తరఫున... ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మహా కూటమి తరఫున చివరి అస్త్రాలను సంధించారు. తేజస్వీ యాదవ్ '10 లక్షల ఉద్యోగాల' హామీతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయగా, నితీశ్ కుమార్ తనదైన శైలిలో జంగిల్‌రాజ్‌ను గుర్తుచేస్తూ లాలూ ప్రసాద్ యాదవ్ పాలనపై విమర్శలు గుప్పించారు. తలరాతను నిర్ణయించనున్న తొలి దశ బిహార్ ఎన్నికల్లో పార్టీల భవితవ్యాన్ని తొలి దశ ఎన్నికలే నిర్ణయించనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే ఈ 121 స్థానాల్లోనే ఆర్జేడీ, జేడీ(యూ) బలాబలాలు పరీక్షకు నిలవనున్నాయి. ఆర్జేడీ తన 'ముస్లిం%-%యాదవ్' సమీకరణాన్ని పటిష్టం చేసుకుందో లేక నితీశ్ కుమార్ తన 'ఈబీసీ, మహాదళిత్' ఓటు బ్యాంకును నిలబెట్టుకున్నారో లేదో మొదటి దశ ఎన్నికలే స్పష్టం చేస్తాయి.

**అందరి కళ్లూ చిరాగ్‌పైనే**

ఈ ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేయగల ఏకైక అంశం 'చిరాగ్ ఫ్యాక్టర్'. ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, ప్రధాని నరేంద్ర మోదీకి జై కొడుతూనే సీఎం నితీశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తున్న చిరాగ్ పాశ్వాన్(ఎల్‌జేపీ%-%రామ్ విలాస్).. ఈ తొలి దశలో అత్యంత కీలకంగా మారారు. జేడీ(యూ) పోటీ చేస్తున్న దాదాపు అన్ని స్థానాల్లో ఎల్‌జేపీ%-%రామ్ విలాస్ తమ అభ్యర్థులను నిలబెట్టింది. ఈ అభ్యర్థులు జేడీ(యూ) ఓటు బ్యాంకును భారీగా చీల్చే అవకాశం కనిపిస్తోంది. ఈ ఓట్ల చీలిక నేరుగా మహాగఠ్‌బంధన్ అభ్యర్థుల గెలుపునకు దారితీస్తుందని విశ్లేషకుల అంచనా.

**పోటాపోటీ ఇక్కడే**

తొలి దశలో నితీశ్ కేబినెట్‌లోని 8 మంది మంత్రులతో




సహా పలువురు ఉద్ధండుల భవితవ్యం తేలనుంది.

? ఇమామ్‌గంజ్: మాజీ సీఎం జితన్‌రామ్ మాంఝీ (హిందూస్తానీ అవామ్ మోర్చా) భవితవ్యాన్ని తేల్చనున్న ప్రతిష్టాత్మక స్థానం.

జముయి: అంతర్జాతీయ షూటర్ శ్రేయసి సింగ్ (బీజేపీ) రాజకీయ అరంగేట్రం చేస్తున్న స్థానం.

గయా టౌన్: బీజేపీ కంచుకోటలో మంత్రి ప్రేమ్ కుమార్ మరోసారి బరిలో ఉన్నారు.

బాంకా: మంత్రి రామ్ నారాయణ్ మండల్ (బీజేపీ), మాజీ మంత్రి జైప్రకాశ్ నారాయణ్ యాదవ్ (ఆర్జేడీ) మధ్య ముఖాముఖి పోరు.

**ప్రభావిత అంశాలు**

ఈ ఎన్నికల మొత్తంలో రాజకీయ చర్చను నిర్దేశించిన ఏకైక అంశం ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టి. తాము అధికారంలోకి వస్తే 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తొలి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించడం కులాలకు అతీతంగా యువతను ఆకర్షిస్తోంది.

15 ఏళ్ల నితీశ్ కుమార్ పరిపాలనపై ప్రజల్లో సహజంగానే కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. దీన్ని తమకు అనుకూలంగా మలచుకోవడానికి విపక్ష కూటమి తీవ్రంగా యత్నించింది.

ఎన్డీయేకు ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాయే అతిపెద్ద బలం. నితీశ్‌పై ఉన్న వ్యతిరేకతను మోదీ ఇమేజ్‌తో అధిగమించాలని బీజేపీ వ్యూహరచన చేసింది.

నితీశ్ కుమార్ తన ప్రచారంలో ప్రధానంగా అభివృద్ధి, శాంతి భద్రతల గురించే ప్రస్తావించారు. రాష్ట్రానికి 'జంగిల్‌రాజ్' నుంచి విముక్తి కల్పించానని చెప్పారు. ప్రతి గ్రామానికీ విద్యుత్, రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించానని గుర్తుచేశారు. నితీశ్ కుమార్ 'అభివృద్ధి' ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ప్రతిపక్షాలు ప్రాధాన్యం ఇచ్చాయి. రాష్ట్రంలోనే పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఉంటే బిహార్ బిడ్డలు ఇతర రాష్ట్రాలకు ఎందుకు వలస వెళ్తున్నారని ప్రశ్నించాయి.

## కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం..

# కనువిందు చేయనున్న బీవర్ సూపర్ మూన్!

ఖగోళప్రియులకు వింతలను వీక్షించాలని భావించే వారికి గుడ్‌న్యూస్. కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానున్నది. అంటే నవంబర్ 5న ఆకాశంలో చంద్రుడు సాధారణం కంటే పెద్దగా, మరింత ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. దీన్నే బీవర్ సూపర్ మూన్‌గానూ పిలుస్తారు. ఈ సూపర్ అరుదైన ఖగోళ దృగ్విషయం కాగా.. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత దగ్గరగా చేరడంతో ఈ అద్భుతం దృశ్యం ఏర్పడుతుంది. గతంలో ఇలాంటి అదృశ్యం చైనాలోని చెంగ్డులోని లాంగ్‌క్వాన్ పరత్వ ప్రాంతంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా ఉంటాడు. చల్లని శరదృతువు రాత్రిలో మరింత ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు. ఈ సూపర్‌మూన్ ఈ ఏడాదిలో ఏర్పడనున్న మూడు సూపర్‌మూన్‌లో రెండోది. ఉత్తర అమెరికాలోని స్థానిక తెగల నుంచి బీవర్ సూపర్ మూన్‌గా పేరు వచ్చింది. బీవర్లు శీతాకాలంలో గుహలను నిర్మించే, నదులు గడ్డకట్టే ముందు వేటగాళ్లు ఉచ్చులు వేసే సీజన్‌ను ఇది



సూచిస్తుంది. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో ఉండదు. కానీ, కక్ష్యలో తిరిగే సమయంలో భూమికి చంద్రుడు దగ్గరగా, దూరంగా వెళ్తుంటాడు. పౌర్ణమి రోజున చంద్రుడు తన కక్ష్యలో భూమికి దగ్గరగా వచ్చిన దృష్యాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు భూమి నుండి దాదాపు 3,57,000 కిలోమీటర్ల దూరంలో ఉంటాడు. ఈ కారణంగా ఇది సాధారణ పౌర్ణమి కంటే ఏడుశాతం పెద్దగా ఉంటుంది. అలాగే, 16శాతం ఎక్కువ చంద్రుడు ప్రకాశవంతంగా కనిపిస్తాడు. చంద్రుడు చేరుకున్న సమయంలో భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యకు దగ్గరగా ఉన్న పెరిజీ దగ్గర ఉన్నప్పుడు సూపర్‌మూన్ సంభవిస్తుంది. శాస్త్రీయ భాషలో దీన్ని పెరిజీ పౌర్ణమిగా పిలుస్తారు. కానీ, ప్రతి సూపర్‌మూన్ ఒకేలా ఉండదు. చంద్రుడు రాత్రంతా ప్రకాశవంతమైన రాశిచక్రం నక్షత్రరాశి వృషభంలో ఉంటాడు. ప్రకాశవంతమైన కాంతి సమీపంలోని నక్షత్రాలను అస్పష్టంగా చేస్తుంది. కానీ, టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని చూస్తే నీరింజ, ఎరుపు నక్షత్రం ఆల్డెబరాన్‌ను చూడొచ్చు. ఇది భూమి నుంచి 65 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటుంది. చంద్రుడు, ఆల్డెబరాన్ మధ్య ప్లీయేడ్స్ ఉంది. ప్లీయేడ్స్‌ను సెవెన్ సిస్టర్స్‌గా పిలుస్తారు. ఇది బిగ్ డిప్పర్‌ను పోలి ఉండే మెరిసే నక్షత్ర సమూహం. ఇది భూమి నుంచి 330 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటుంది. బీవర్ మూన్‌ను చూసేందుకు ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. ఆకాశం వైపుగా చూస్తే సరిపోతుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6.49 గంటలకు పూర్ణచంద్రుడు దర్శనమిస్తాడు.

## రికార్డు స్థాయి విజయం తథ్యం

న్యూఢిల్లీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమికి ఈసారి రికార్డు స్థాయి విజయం కట్టబెట్టాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. గత 20 ఏళ్లలో ఏన్నడూ లేనట్టి అద్భుతమైన విజయం ఈ ఎన్నికల్లో సాధించబోతున్నామని చెప్పారు. జంగిల్‌రాజ్ మనుషులకు ఘోరమైన పరాభవం తప్పదని పునరుద్ఘాటించారు. ఇద్దరు యువరాజులు రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల మద్దతు పొందడానికి తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన యువరాజు ఛఠ్ పూజలను అవమానించాడని మండిపడ్డారు. ప్రధాని మోదీ మంగళవారం బిహార్ బీజేపీ మహిళా కార్యకర్తలతో నమో యాప్ ద్వారా వర్చువ ల్‌గా సమావేశమయ్యారు. పార్టీ విజయం కోసం మహిళా కార్యకర్తలు కష్టపడి పని చేసు న్నారని ప్రశంసించారు. బిహార్‌లో ఇటీవల పలు బహిరంగ సభల్లో పాల్గొన్నా నని, మహి ళలు అత్యధికంగా హాజరయ్యారని చెప్పారు. ఒక సభకు మించి మరో సభ జరిగిందన్నారు. ఎన్డీయేకు మహిళల ఆదరణ మరింత పెరిగిందని సంతోషం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఎన్డీయే విజయం పట్ల తనకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. ఎవరూ ఊహించలేని భారీ విజయం సాధించబోతున్నామని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో పేదలు, దళితులు, మహా దళితులు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని మోదీ పేర్కొన్నారు. మహిళల సాధికారతకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. వారి జీవనం మరింత సులభతరంగా మారేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సుపరిపాలన, చట్టబద్ధమైన పాలన అమల్లో ఉన్నప్పుడే మహిళలు అభివృద్ధి సాధించడానికి అవకాశాలు ఉంటాయని వివరించారు. ఎన్డీయే పాలనలో ఆడబిడ్డల ప్రగతికి పెద్దపీట వేశామన్నారు. బిహార్ మహిళలు నేడు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని ప్రశంసల వర్షం కురిపించారు.

## ప్రధానిది నకిలీ డిగ్రీ



ఔరంగాబాద్

విద్య, ఉద్యోగం, ఆరోగ్యం వంటి ముఖ్యమైన సమస్యల నుంచి యువత దృష్టి మళ్లించడానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. యువత నిరంతరం సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేసుకుంటుంటే కీలక సమస్యలపై నిలదీయరనే ఉద్దేశంతోనే ఆయన దీన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. బిహార్‌లో తొలిదశ ఎన్నికల ప్రచారానికి చివరిరోజైన మంగళవారం రాహుల్.. ఔరంగాబాద్, గయాజీలలో ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. "రీల్స్‌కు బానిసలై యువతీయువకులు ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌లలో గడపాలని మోదీ కోరుకుంటున్నారు. 21వ శతాబ్దంలో ఇదొక కొత్త మత్తు. ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయకుండా యువత ఆలోచనల్ని పక్కదారి పట్టించే ఎత్తుగడ. మోదీది నకిలీ డిగ్రీ. అందుకే విద్యారంగంపై ఆయన అనాసక్తితో ఉంటారు. నలంద విశ్వవిద్యాలయం గొప్పతనం ఆయనకు తెలియదు" అని చెప్పారు.

**ఓట్లచోరీతో అశాంతికి ఆజ్యం**

"మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా కలిసి బిహార్‌లో ఓటుచోరీకి పాల్పడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు. కాంగ్రెస్–ఆర్జేడీ గానీ అధికారంలోకి వస్తే ఆటవిక రాజ్యం మళ్లీ వస్తుందని మోదీ చెబుతారు. నిజానికి ఓట్లచోరీ ద్వారా అశాంతిని ప్రోత్సహిస్తున్నదే ఆయన" అని రాహుల్ విమర్శించారు.

**మీరు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనా?**

"నీతీశ్ గత 20 ఏళ్లుగా ప్రభుత్వాన్ని నడుపుతున్నా బిహార్ అభివృద్ధి చెందట్లేదు. నేను కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ ఇలా ఎక్కడికి వెళ్లినా అక్కడ బిహార్ యువతను గమనిస్తున్నాను. మీరందరూ కష్టపడి పనిచేస్తారు. భారీ భవనాలు, వంతెనలు, సొరంగాలను నిర్మించేది బిహార్ యువతే. ఎక్కడికి వెళ్లినా మీరు కార్మికులుగానే పనిచేయాలి. మీరు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనా? జీవితాంతం శ్రమతోనే గడపాలనుకుంటున్నారా?" అని యువతను రాహుల్ ప్రశ్నించారు.

## తూటాకు తూటాతోనే జవాబు

దర్భంగా, మోతీహారి: భారత్‌పై మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే తూటాకు తూటాతోనే సమాధానమిస్తామని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. బిహార్‌లో ప్రతిపాదిత రక్షణరంగ పరిశ్రమల నడవాలో తయారయ్యే పేలుడు పదార్థాలనే ఆ ఉగ్రవాదులపై వాడతామని చెప్పారు. పహల్గాంలో పౌరుల ప్రాణాలు బలిగొన్న ముష్కరులకు వారి నేలపైనే మన సైన్యం దీటైన జవాబు ఇచ్చిందని గుర్తుచేశారు. మంగళవారం బిహార్‌లోని దర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వీ సీఎం కాలేరని, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తనయుడు రాహుల్ పీఎం కాబోరని చెప్పారు. ఓటు ఎవరికి వేయాలనే విషయంలో బిహార్ ఓటర్లు తప్పుచేస్తే హత్యలు, లూటీలు, అపహరణలు, బెదిరింపులు నిత్యకృత్యమవుతాయని హెచ్చరించారు. ప్రధాని మోదీని, ఆయన తల్లిని ఆర్జేడీ–కాంగ్రెస్ అవమానించిందని, ఎన్నికల్లో బిహార్ ప్రజలు దీనికి ప్రతీకారం తీర్చుకుంటారని చెప్పారు. ఆటవిక పాలన తిరిగి రావద్దంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలని కోరారు. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమచేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారని, లాలూ తాతలు దిగొచ్చినా అది సాధ్యం కాదని చెప్పారు. ఆర్జేడీ పాలనలో బిహార్ ఎలా రక్తసిక్తమైందో గుర్తుచేసుకోవాలన్నారు. అక్రమ వలసదారుల్ని రక్షించేందుకు రాహుల్‌గాంధీ ఎన్ని సభలు నిర్వహించినా తాము మాత్రం వారిని తరిమికొట్టడం ఖాయమని తేల్చిచెప్పారు.

**ఎన్డీయేతోనే బిహార్ అభివృద్ధి : రాజ్‌నాథ్**

ఎన్డీయే పాలనలోనే బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వైశాలీ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కావాల్సిన డబ్బు ఎక్కడినుంచి వస్తుందని ప్రశ్నించారు.

**పేదల హక్కుల్ని దోచుకుని భారీ వాగ్దానాలు చేస్తున్నారు: యోగి**

సమస్తీపూర్: బిహార్‌కు ఏదేదో చేసేస్తామని పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్నవారు 20 ఏళ్ల క్రితం యువత ఉద్యోగాలను దోచుకుని, పేదల హక్కుల్ని లాక్కొన్నారని, ఆటవిక రాజ్యం తెచ్చారని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు.

## బిజినెస్ వాయిస్

### అభరణాల ఎగుమతులకు ట్రంప్ దెబ్బ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు దేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా అభరణాలు, రత్నాల ఎగుమతులు భారీగా దెబ్బతిన్నాయి. భారత అభరణాలు, రత్నాలపై ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్‌లతో గడిచిన సెప్టెంబర్‌లో విలువైన రత్నాలు, ముత్యాలు, విలువైన రంగురాళ్ల ఎగుమతులు 76.7 శాతం క్షీణించాయి. బంగారం, ఇతర విలువైన లోహాల ఆభరణాల ఎగుమతులు 71.1 శాతం పడిపోయాయి. ఈ ఏడాది మే–సెప్టెంబర్ కాలంలో 58 శాతం క్షీణించి 202..8 మిలియన్లకు పతనమయ్యాయి. గతేడాది ఇదే కాలంలో వీటి ఎగుమ తులు 500.2 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ట్రంప్ అధిక సుంకాల కారణంగా యుఎస్ కొనుగోలు దారులు ఇప్పుడు థారులాండ్, వియత్నాం, చైనా వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ దేశాలు 20–30 శాతం మధ్య తక్కువ సుంకాలను కలిగి ఉన్నాయి. భారత్‌లో రత్నాలు, ఆభరణాల రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. వీటి ఎగుమతుల క్షీణతతో ఈ రంగంలోని ఉద్యోగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో రత్నాలు, అభరణాల రంగాలను ఆదుకోవడానికి తమకు వడ్డీ రాయితీలు, అత్యవసర రుణాలివ్వాలని జిజెఇపిసి కేంద్రాన్ని కోరుతోంది.

### అనిల్ అంబానీ రూ.3 వేల కోట్ల ఆస్తులు అటాచ్



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన రూ.3వేల కోట్ల పైగా విలువైన ఆస్తులను ఎన్ ఫోర్స్ డైరెక్టరేట్ (ఇడి) అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తుల లిస్టులో ఆయన ఇంటితో పాటు పలు కమెర్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి. ఈ మేరకు ఇడి అధికారిక వర్గాలు సోమవారం పలు వివరాలను వెల్లడించాయి. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న ఆయన వాటిని వ్యాపారం కోసం ఉపయోగించకుండా మనీలాండరింగ్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించిన కేసులో ఇడి ఈ నిర్ణయం తీసుకుంది. అటాచ్ చేసిన అస్తుల్లో అనిల్ అంబానీకి చెందిన ముంబయిలోని ఆయన నివాసం, గ్రూప్ సంస్థల యాజమాన్యంలోని ఇతర నివాస, వాణిజ్య ఆస్తులు ఉన్నాయి. వీటికి సంబంధించి తాత్కాలిక ఉత్తర్వులను ఇడి జారీ చేసింది. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సిబిఐ తొలుత దర్యాప్తు చేపట్టింది. ఆ సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. తాజాగా ఢిల్లీలోని మహారాజా రంజిత్‌సింగ్ మార్గ్‌లోని రిలయన్స్ సెంటర్‌కు చెందిన భూమి, నోయిడా, ఘజియాబాద్, ముంబయి, పూణే, థానే, హైదరాబాద్, చెన్నరు, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న అనేక ఆస్తులు అటాచ్ చేసిన జాబితాలో ఉన్నాయి. ఈ అటాచ్ చేయబడిన ఆస్తుల విలువ సుమారు 3,084 కోట్లుగా ఉంటుందని అంచనా.

# భారత్‌లో ఆ కార్లన్నీ వెనక్కి.. కంపెనీ ప్రకటన



సొంత కారు అనేది భారతీయుల్లో పెరుగుతున్న అభిరుచి. చాలా మంది తమకంటూ సొంత ఇల్లు, అందులో కారు ఉండాలని భావిస్తుంటారు. ధనవంతులు అయితే రెండు మూడు ఆపైన కార్లు కొంటారు.అయితే కారు కొనుగోలు చేయడంతోనే సరిపోదు దాని నిర్వహణ సైతం చాలా ముఖ్యం. లేదంటే ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే కారు తయారు చేసిన కంపెనీ ఇచ్చే అప్డేట్స్ ఎప్పుడూ అనుసరిస్తూ ఉండాలి. కొన్నిసార్లు కంపెనీలు ఏదైనా సమస్య ఏర్పడినట్లు గుర్తిస్తే రీకాల్ చేస్తాయి. నిర్దేశిత సమయంలో తయారు చేసిన కార్లను వెనక్కి పిలిపించి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తాయి. అలా ఇప్పుడు ఓ కంపెనీ భారత్‌లో రీకాల్ చేసింది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీల్లో ఒకటైన పోర్ష్చే భారత దేశంలోని పనామెరా కార్లను రీకాల్ చేసింది. పనామెరా కారు ఉపయోగిస్తున్న వినియోగదారులందరూ ఈ విషయాన్ని తెలుసుకోవాలి. అయితే రీకాల్ ద్వారా సమస్య పరిష్కారానికి ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని కంపెనీ తెలిపింది. మొత్తంగా 158 యూనిట్లను వెనక్కి పిలిపిస్తున్నట్లు పేర్కొంది. వాఃఖూవీ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం పనామెరా మోడల్ కార్లలోని ఎయిర్ బ్యాగ్ సిస్టమ్‌లో లోపం ఉన్నట్లు గుర్తించింది. ఎయిర్ బ్యాగ్ వ్యవస్థలోని సమస్యను పరిష్కరించేందుకు పోర్ష్చే కంపెనీ ఆయా కార్లను రీకాల్ చేసినట్లు తెలుస్తోంది. పోర్ష్చే పనామెరా కార్లు ఉపయోగిస్తున్న వారు బ్రాండ్ అధికారిక రీకాల్ పోర్టల్ లోకి వెళ్లి తమ వాహన గుర్తింపు సంఖ్య ఇన్‌పుట్ చేసి వారి కారు రీకాల్ లిస్టులో ఉందో లేదో తెలుసుకోవచ్చని కంపెనీ పేర్కొంది. 2023, జూలై 19 నుంచి 2025 సెప్టెంబర్ 2వ తేదీ మధ్య తయారైన కార్లను రీకాల్ చేసినట్లు వెల్లడించింది. ఈ తేదీల మధ్య తయారు చేసిన కార్లు కొనుగోలు చేసిన యజమానులు వెంటనే వివరాలు తనిఖీ చేసి కంపెనీకి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఎయిర్ బ్యాగ్ వ్యవస్థలో ఏర్పడిన సమస్య వల్ల వాహన వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రమాదం జరిగినప్పుడు అవి తెరుచుకోకపోతే ప్రాణాలు కోల్పోవచ్చని తెలిపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ రీకాల్ జారీ చేసినట్లు తెలుస్తోంది. రీకాల్ చేసిన కార్లలో ఎయిర్ బ్యాంక్ సిస్టమ్ సమస్యను కంపెనీ ఉచితంగానే రిపేర్ చేయనుంది. కాబట్టి దీని కోసం కస్టమర్లు లేదా వినియోగదారులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని కంపెనీ పేర్కొంది. పోర్ష్చే కంపెనీ గతంలో ఆస్ట్రేలియాలోనూ పనామెరా కార్లను రీకాల్ చేసింది. ఇలాంటి ఎయిర్ బ్యాగ్ సిస్టమ్ సమస్యను గుర్తించిన క్రమంలోనే పలు యూనిట్లను వెనక్కి పిలిపించింది.

# అమెరికాకు తగ్గిన భారత ఎగుమతులు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు దేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ ఏడాది మే నుంచి సెప్టెంబర్‌లో యుఎస్‌కు ఎగుమతులు ఏకంగా 37.5 శాతం పతనమయ్యాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ ఐదు నెలల కాలంలో యుఎస్‌కు 5.5 బిలియన్ డాలర్ల విలువ చేసే సరకుల సరఫరా మాత్రమే జరిగింది. గతేడాది ఇదే కాలంలో ఏకంగా 8.8 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి. ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమైన అదనపు సుంకాలు ఆగస్టు చివరి నాటికి 50 శాతానికి పెంచుతూ ట్రంప్ నిర్ణయాలు చేశారు. అధిక టారిఫ్‌లు భారత పరిశ్రమలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు, ఫార్మాస్యూటికల్స్, రత్నాలు అండ్ ఆభరణాలు, వస్త్రాలు, సోలార్ ప్యానెల్‌లు, రసాయనాలు, సముద్ర ఉత్పత్తులు వంటి కీలక రంగాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 58 శాతం పతనమై 884.6 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నాలుగు నెలల్లో 2.29 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. ఇదే సమయంలో రత్నాలు అభరణాల ఎగుమతులు 500.2 మిలియన్ డాలర్లుగా ఉండగా.. గడిచిన మే–సెప్టెంబర్ కాలంలో 58 శాతం క్షీణించి 202..8 మిలియన్లకు పతనమయ్యాయి. సోలార్ ప్యానెల్ ఎగుమతులు 60.8 శాతం పతనంతో 79.4 మిలియన్లకు తగ్గాయి. ఔషధ ఉత్పత్తుల ఎగుమతులు 15.7 శాతం, వస్త్రాలు, రసాయనాలు, వ్యవసాయ ఉత్పత్తులు వంటి రంగాలు 33 శాతం పతనాన్ని చవి చూశాయి.

# కప్ చేజారినా నంబర్ 1 ర్యాంక్..

# తొలిసారి టాప్-10లో జెమీమా..!

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో మెరిసిన క్రికెటర్లు ర్యాంకింగ్స్‌లో సత్తా చాటారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయ శతకంతో జట్టును గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్ తొలిసారి టాప్–10లోకి దూసుకొచ్చింది. అయితే.. భారత ఓపెనర్ స్మృతి మంధానకు మాత్రం దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్డ్ట్ షాకిచ్చింది. పదమూడో సీజన్ ప్రపంచకప్‌లో సఫారీలకు కప్ అందించలేకపోయిన లారా వ్యక్తిగతంగా మైలురాయికి చేరుకుంది. కెరీర్‌లోనే అత్యుత్తమంగా 814 రేటింగ్ పాయింట్స్‌తో నంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకుంది. వరల్డ్ కప్ ముందు నుంచి టాప్‌లో ఉన్న మంధాన టోర్నీ ముగిసే ఒక ర్యాంక్ కోల్పోయింది. స్వదేశంలో జరిగిన మెగా టోర్నీలో శుభారంభాలు ఇస్తూ ఒక సెంచరీ, ఒక అర్ధ శతకంతో టీమిండియా విజయంలో కీలకమైన తను రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. ప్రపంచ కప్‌లో సూపర్ ఫామ్ కొనసాగించి వరుసగా రెండు శతకాలు బాదిన లారా వన్డేల్లో ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అదిరే బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను ముందుండి నడిపించిన ఆమె ఫైనల్లోనూ 101 రన్స్‌తో పోరాడిన జట్టును గెలిపించలేకపోయింది. అయితే.. టోర్నీలో 571 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచిన లారా టీమిండియా వైస్ కెప్టెన్ మంధానను రెండో స్థానానికి నెట్టేసింది. ప్రస్తుతం మంధాన ఖాతాలో 811 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. టీ20 బ్యాటర్ల జాబితాలోనూ ఆమె రెండో స్థానంలోనే కొనసాగుతోంది.



**ఆ సెంచరీతో టాప్‌లోకి**

వరల్డ్ కప్ నాకౌట్ పోరులో ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ సెంచరీ జెమీమా రోడ్రిగ్స్‌కు ప్లస్ అయింది. పటిష్టమైన ఆసీస్ పేస్ దళాన్ని ఎదుర్కొని 127 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ఫైనల్ చేర్చిన జెమ్మీ.. ఏకంగా తొమ్మిది స్థానాలు మెరుగుపరచుకొని మొదటిసారి వన్డే ర్యాంకిగ్స్‌లో టాప్ – 10లోకి దూసుకొచ్చింది. సెమీస్‌లో భారత్‌పై సెంచరీతో మెరిసిన ఫొబే లిచ్‌ఫీల్డ్ 13 స్థానాలు మెరుగుపడి.. 13వ స్థానం సాధించింది. 215 పరుగులు, 22 వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికైన దీప్తి శర్మ ఆల్‌రౌండర్ల విభాగంలో నాలుగో ర్యాంక్‌కు ఎగబాకింది.

## ఆర్సీబీకి కొత్త హెడ్ కోచ్..



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ కోచింగ్ స్టాఫ్‌లో కీలక మార్పులు చేసింది. తమ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా తమిళనాడు మాజీ క్రికెటర్ మలోలన్ రంగరాజన్‌ను ఆర్సీబీ యాజమాన్యం నియమించింది. రెగ్యూలర్ హెడ్ కోచ్ ల్యూక్ విలియమ్స్ బిగ్ బాష్ లీగ్ లో అడిలైడ్ స్ట్రైకర్స్‌తో ఒప్పందం కుదుర్చుకోవడంతో రాబోయే డబ్ల్యూపీఎల్ ఎడిషన్‌కు దూరంగా ఉండనున్నాడు. ఈ క్రమంలోనే విలియమ్స్ స్థానాన్ని రంగరాజన్‌తో ఆర్సీబీ భర్తీ చేసింది. రంగరాజన్ గతంలో ఆర్సీబీ పురుషుల, మహిళల జట్లకు స్కౌట్, ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశారు. మరోవైపు ఇంగ్లండ్ మాజీ నేసర్ అన్యా ష్రబ్సోల్‌ను తమ బౌలింగ్ కోచ్‌గా ఆర్సీబీ ఎంపిక చేసింది. అన్యా గతంలో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి 'ది హండ్రెడ్'లో సదరన్ బ్రేవ్ తరపున ఆడింది. ష్రబ్సోల్..గత సీజన్ వరకు బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన సునేత్ర పరంజాపే స్థానంలో బాధ్యతలు చేపట్టనుంది. ష్రబ్సోల్ ఇంగ్లండ్ తరపున 86 వన్డేలు, 79 టీ20లు, 8 టెస్టులు ఆడింది. ఇక బ్యాటింగ్ కోచ్‌గా ఆర్ మురళీధర్, హెడ్ ఫిజియోగా నవనీత గౌతమ్ తమ పదవుల్లో కొనసాగనున్నారు. కాగా ఈ నెలాఖరులో డబ్ల్యూపీఎల్ మినీ వేలం జరగనుంది. నవంబర్ 5లోపు ఆయా ఫ్రాంచైజీలు ఆటగాళ్ల రిటెన్షన్ జాబితాను సమర్పించాలి.

## క్రీడా వాయిస్

### ఆసియా కప్‌లో హద్దుమీరిన పాక్ పేసర్‌పై నిషేధం.. భారత కెప్టెన్‌కు భారీ జరిమానా..!



ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెటర్ల తీరుపై విచారణ చేపట్టిన ఐసీసీ కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రికెట్ మైదానంలో రెచ్చగొట్టే చేష్టలు, రాజకీయ అంశాలను ప్రస్తావించడాన్ని ఏమాత్రం సహించమని స్పష్టం చేసింది. భారత్, పాకిస్థాన్ మధ్య తొలి లీగ్ దశ మ్యాచ్‌లో రెచ్చగొట్టే సంజ్ఞలు చేసినందుకుగానూ పేసర్ హ్యారిస్ రవుఫ్ పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. ఐసీసీ నియమావళిని ఉల్లఘించినందుకు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కు మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా వేసింది. ఆసియా కప్‌లో లీగ్ దశలో భాగంగా సెప్టెంబర్ 14న భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్ టాస్ సమయంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాతో షేక్ హ్యాండ్ చేసేందుకు నిరాకరించాడు. ఇక బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు భారత ప్రేక్షకులు హ్యారిస్ రవుఫ్‌ను కోహ్లీ కోహ్లీ అని ఆటపట్టించారు. అందుకు అతడు విమానాల్ని కూల్చివేసినట్టుగా సంజ్ఞలు చేశాడు. అంతేకాదు ఆరు జెట్లను కూల్చాం అని చేతివేళ్లను చూపిస్తూ భారత క్రికెటర్లనే కాదు అభిమానులను రెచ్చగొట్టాడు. అనంతరం పాక్ ఇన్నింగ్స్‌లో అర్ధశతకం తర్వాత ఓపెనర్ ఫర్హాన్ గన్ సెలబ్రేషన్ చేసుకున్నాడు. వీరి చర్యలను తీవ్రంగా పరిగణించిన భారత బోర్డు రిఫరీకి ఫిర్యాదు చేసింది. అయితే.. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ పహల్గాం మృతులకు విజాయన్ని అంకితమివ్వడం, భారత సైనికుల పరాక్రమాన్ని కొనియడడంపై పాక్ బోర్డు అభ్యంతరం తెలిపింది. తమ సారథితో కరచాలనం చేయకపోగా.. రాజకీయ వ్యాఖ్యలు చేశాడని సూర్యపై ఫిర్యాదు చేసింది. అయితే.. టోర్నీ సమయంలో గొడవను పెద్దది చేయడం ఇష్టంలేక తాత్కాలికంగా హెచ్చరికలతో సరిపుచ్చింది ఐసీసీ. తాజాగా ఇరుదేశాల బోర్డుల ఫిర్యాదులపై విచారణ చేపట్టిన ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినందుకు కఠిన చర్యలు తీసుకుంది.



## చైతూ సరసన సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ.. ఫస్ట్ లుక్ అదుర్స్!

తండేల్ మూవీ తర్వాత అక్కినేని హీరో నాగచైతన్య భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ మూవీ కోసం కార్తీక్ దండుతో ఆయన జతకట్టారు. చైతూ కెరీర్‌లో 24వ చిత్రంగా రానున్న ఈ సినిమాను ఎన్‌సీ24 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. అడ్వంచరస్ మైథాలజీ చిత్రంగా రానున్న ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలో సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ అడ్వెంచరస్ మూవీలో దక్ష పాత్రలో మెప్పించనుంది. తాజాగా రిలీజైన పోస్టర్ చూస్తుంటే పురావస్తు శాఖలో శాస్త్రవేత్తగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది రిలీజైన సంక్రాంతికి వస్తున్నాం మూవీలోనూ ఐపీఎస్ ఆఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఈ సారి మరో డిఫరెటంట్ రోల్‌తో అభిమానులను అలరించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది.



## సుధీర్ బాబుకి జటిలమైన పరీక్ష

ఈ వారం విడుదలవుతున్న వాటిలో బడ్జెట్ పరంగా పెద్ద సినిమా జటాధరనే. సుధీర్ బాబు హీరోగా రూపొందిన ఈ హారర్ కం డివోషనల్ డ్రామా కోసం బాలీవుడ్ నిర్మాతలు గట్టిగానే ఖర్చు పెట్టారు. ప్యాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. ఇటీవలే జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో సుధీర్ బాబు మనసు విప్పి మాట్లాడిన నిజాలు మూవీ లవర్స్ ని ఆకట్టుకున్నాయి. లేనిపోని భేషజాలు హీరోయిజం చూపించకుండా ఉన్నది ఉన్నట్టు చెప్పేసి తను ఎంత కష్టపడింది చెప్పుకొచ్చాడు. అయితే జటాధరకు బయట పెద్దగా బజ్ లేదు. ట్రైలర్ విజువల్స్ బాగానే ఉన్నా జనాలకు పూర్తి స్థాయిలో రీచ్ కాలేకపోయాయి. ఈ నేపథ్యంలో దీని మీద బోలెడు ఆశలు పెట్టుకున్న సుధీర్ బాబుకి బాక్సాఫీస్ వద్ద జటిలమైన పరీక్షే ఎదురు కానుంది. ఎందుకంటే జటాధరా సోలోగా రావడం లేదు. కాంపిటీషన్ లో రష్మిక మందన్న ది గర్ల్ ఫ్రెండ్ ఉంది. దీని మీద హీరోయిన్ ఇమేజ్, జానర్ ఎఫెక్ట్ వల్ల ఓ మోస్తరు బజ్ ఉంది. విష్ణు విశాల్ డబ్బింగ్ మూవీ ఆర్యన్ మీద హైప్ రావడం అనుమానమే. తిరువీర్ ది గ్రేటెస్ట్ ప్రీ వెడ్డింగ్ షో కూడా హైప్ సమస్యతో ఇబ్బంది పడుతోంది. సో ఎలా చూసుకున్నా మాస్ ఆడియన్స్ కి ఫస్ట్ ఛాయస్ అయ్యేందుకు జటాధరాకు అవకాశాలున్నాయి. కాకపోతే టాక్ పాజిటివ్ గా రావాల్సిన అవసరం చాలా ఉంది. ఇది కనక నెగ్గితే సుధీర్ బాబుకి మళ్ళీ మార్కెట్ ఓపెనవుతుంది. గత కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి. హరోంహర ఒకటే కొంచెం పర్వాలేదనిపించుకుంది కానీ మరీ అద్భుతాలేం చేయలేదు. సో జటాధరా సక్సెస్ అయితే తిరిగి అవకాశాలు ఊపందుకుంటాయి.

## బాలీవుడ్ అడల్ట్ కామెడీ 'మస్తీ 4' ట్రైలర్ విడుదల

బాలీవుడ్ అడల్ట్ కామెడీ ఫ్రాంచైజీ 'మస్తీ' నుంచి మరో కొత్త చిత్రం రాబోతుంది. బాలీవుడ్ హీరోలు రితేశ్ దేశ్‌ముఖ్, వివేక్ ఒబెరాయ్, అఫ్తాబ్ శివదాసాని ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మస్తీ 4'. ఈ సినిమాకు మిలన్ జవేరి దర్శకత్వం వహిస్తుండగా.. శ్రేయ శర్మ, రూహి సింగ్, ఎల్నాజ్ నోరౌజి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.






## తొలి మెరుపు ఏంటో మరి? దుల్కర్ సల్మాన్ కాంత నుంచి కొత్త పోస్టర్

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది మరికొద్దిసేపట్లో క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## విజయ్‌తో ఎంగేజ్‌మెంట్.. టాక్ షోలో దొరికిపోయిన రష్మిక!



ఈ ఏడాది వరుస సినిమాలతో దూసుకెళ్తోన్న బ్యూటీ రష్మిక మందన్నా. ఇప్పటికే ఛావాతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన ఈ బ్యూటీ.. ఇటీవలే థామా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం రష్మిక నటించిన ది గర్ల్‌ఫ్రెండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉంది ముద్దుగుమ్మ. ఈ సినిమా నవంబర్ 7న థియేటర్లలో సందడి చేయనుంది. ది గర్ల్‌ఫ్రెండ్ మూవీ ప్రమోషన్లలో భాగంగా రష్మిక తాజాగా టాలీవుడ్ టాక్ షోకు హాజరైంది. నటుడు జగపతిబాబు హోస్ట్ చేస్తున్న జయమ్ము..నిశ్చయమ్మురా టాక్ షోలో సందడి చేసింది. ఈ షోలో పాల్గొన్న రష్మిక చేతికి రెండు ఉంగరాలు కనిపించడంతో అందరి దృష్టి వాటిపై పడింది. ఈ సందర్భంగా రష్మికను జగపతిబాబు సరదాగా ఆటపట్టించారు. దళపతి విజయ్, విజయ్ సేతుపతి, విజయ్ దేవరకొండతో ఫ్రెండ్‌షిప్, విజయ్ సేతుపతి ఫ్యాన్, దళపతి విజయ్‌కి ఆల్ టైమ్ ఫ్యాన్ ఇలా విజయాన్ని సొంతం చేసేసుకున్నావా? అంటూ ఫన్నీగా మాట్లాడారు. ఆ తర్వాత చేతికి ఉన్న రింగ్స్‌ను సెంటిమెంట్‌తోనే పెట్టుకున్నావా అని జగపతిబాబు అడిగారు. దీనికి రష్మిక మాట్లాడుతూ.. అవీ చాలా ఇంపార్టెంట్ అని ముద్దుగుమ్మ చెప్పేసింది. వాటిలో ఒక రింగ్ ఫేవరేట్ అయి ఉంటుంది.. దానికి ఓ హిస్టరీ కూడా ఉంటుందని జగపతి నవ్వుతూ అన్నారు. దీనిపై ఆడియన్స్ ఏదో గోల చేస్తున్నారు.. అదేంటో కనుక్కోండని రష్మికతో చెప్పగా.. అది తాను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నానంటూ సంతోషం వ్యక్తం చేసింది. అయితే గతనెలలో రష్మిక- విజయ్ దేవరకొండకు ఎంగేజ్‌మెంట్ జరిగిందని వార్తలొచ్చాయి. కానీ ఈ విషయాన్ని ఎవరూ కూడా అధికారికంగా ప్రకటించలేదు. దీంతో టాలీవుడ్ ప్రియులతో పాటు అభిమానుల్లోనూ సస్పెన్స్ నెలకొంది. ఇటీవల తరచుగా రష్మిక చేతికి ప్రత్యేక రింగ్ కనిపించడంతో నిశ్చితార్థం జరిగినట్లు ఫ్యాన్స్ ఫుల్‌గా ఫిక్సయిపోయారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com